

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 30-12-2024 | సంపుటి - 21 | సంచిక -253 | రూ : 4 | పేజీలు: 8




## ఐక్యతా మహా కుంభ్

- విద్వేష నిర్మూలనకు కుంభమేళాలో ప్రతిన
- 'మన్ కీ బాత్'లో ప్రజలకు మోదీ పిలుపు

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 13 నుంచి నెలన్నర పాటు జరగనున్న మహా కుంభమేళాను ఐక్యత మహాకుంభ్‌గా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు.

''అందరూ కుంభమేళాలో పాల్గొని పవిత్ర స్నానాలు ఆచరించాలి. సమాజంలో విద్వేషం, విభజనవాదాల నిర్మూలనకు సంకల్పం తీసుకోవాలి'' అని పిలుపునిచ్చారు. ఆదివారం 117వ 'మన్ కీ బాత్'లో ప్రధాని మాట్లాడారు.

''దేశమంతా ఏకం కావాలన్న గొప్ప సందేశాన్ని కుంభమేళా ఇస్తోంది. భారీతనంలో కాకుండా భిన్నత్వంలోనే దాని ప్రత్యేకత దాగుంది. అంతటి వైవిధ్యాన్ని ప్రపంచంలో ఎక్కడా చూడబోం. అవిశ్రాంత గంగా ప్రవాహంలా సమాజమంతా ఒక్కటిగా ఉండాలి'' అన్నారు. కుంభమేళాలో 11 భారతీయ భాషల్లో ఏఐ చాట్‌బాట్ సేవలను భక్తులు ఉపయోగించుకోవాలని కోరారు.

* 'ఆయుష్మాన్'తో క్యాన్సర్‌కు చెక్

''మన దేశంలో 20152023 మధ్య మలేరియా కేసులు, మరణాలు 80 శాతం తగ్గినట్లు డబ్ల్యూహెచ్ఓ నివేదిక వెల్లడించింది. ఇదో గొప్ప విజయం. మన దగ్గర క్యాన్సర్ చికిత్సను సకాలంలో ప్రారంభిస్తుండడం గణనీయంగా పెరిగిందని లాన్సెట్ జర్నల్ వెల్లడించింది. ఆయుష్మాన్ భారత్ యోజన కింద 90 శాతం మంది క్యాన్సర్ బాధితులు సకాలంలో చికిత్స పొందగలుగుతున్నారు. భారత సంస్కృతి, సంప్రదాయాల పట్ల విదేశీయులు ఆకర్షితులవుతున్నారు.

ఫిజిలో తమిళ టీచింగ్ ప్రోగ్రాంకు ఎంతో ఆదరణ లభిస్తోంది. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో విశిష్టమైన ఒలింపిక్స్ జరిగాయి. పేదరికం, కరువు, వలసలకు మారుపేరైన ఒడిశాలోని కలహండిలో కూరగాయల విప్లవం సాగుతోంది'' అని మోదీ అన్నారు. వచ్చే జనవరి 26న రాజ్యాంగ 75వ వార్షికోత్సవం నిర్వహించుకుంటున్నామని గుర్తు

తరువాయి 2లో

# నేడు శాసనసభ ప్రత్యేక భేటీ

- ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి శ్రీధర్‌బాబు. చిత్రంలో అసెంబ్లీ కార్యదర్శి వి.నర్సింహాచార్యులు
- మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించనున్న అసెంబ్లీ



హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ నేడు ప్రత్యేకంగా సమావేశం కానుంది. భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతికి నివాళులర్పించే ఎజెండాతో సోమవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. సంతాప ప్రతిపాదనను ప్రవేశపెట్టి, మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలను ఉటంకించడంతో పాటు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఆయన పాత్రను విశదీకరిస్తూ ప్రసంగించనున్నారు. సీఎంతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రతిపక్ష పార్టీల సభ్యులు ఈ సమావేశంలో మన్మోహన్ సింగ్ సేవల గురించి ప్రసంగించనున్నారు. సంతాప తీర్మానాన్ని ఆమోదించాక సభ వాయిదా

తరువాయి 2లో

# జనవరిలోగా బీజేపీకి కొత్త అధ్యక్షుడు!



- ఢిల్లీలో సంస్థాగత ఎన్నికల ప్రక్రియ పురోగతిపై భేటీ


న్యూఢిల్లీ: జనవరి నెలాఖరులోగా బీజేపీకి కొత్త జాతీయ అధ్యక్షుడు రానున్నారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం.. జనవరి 10 నాటికి అన్ని జిల్లాల పార్టీ అధ్యక్షుల ఎన్నిక పూర్తికానుండగా, రాష్ట్రాల అధ్యక్షుల ఎన్నికలు 15 నాటికి పూర్తవుతాయి. ఆ తర్వాత జనవరి నెలాఖరు కల్లా పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించనున్నారు. ఆదివారం ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కీలక సమావేశంలో గత ఏడాది కాలంగా జరుగుతున్న పార్టీ సంస్థాగత ఎన్నికలకు సంబంధించిన పురోగతిపై అన్ని రాష్ట్రాల అధ్యక్షుల నుంచి నివేదిక తీసుకున్నారు.అంతేగాక పార్టీ అంతర్గత ఎన్నికలపై కూలంకషంగా చర్చించారు. ఈ సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు అన్ని రాష్ట్రాల పార్టీ అధ్యక్షులు, పార్టీ జాతీయ పదాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ నుంచి పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్, ఆంధ్రప్రదేశ్ నుంచి డి.పురందేశ్వరి సమావేశానికి హాజరయ్యారు.

తరువాయి 2లో

# మల్లన్న మనువాడె.. కొమురెల్లి పులకించె!

- వైభవంగా మల్లికార్జునుడి కల్యాణం

చేర్యాల, డిసెంబరు 29 : సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి క్షేత్రంలో కొలువైన కోరమీసాల కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణం ఆదివారం సంప్రదాయబద్ధంగా, అంగరంగ వైభవంగా జరిగింది. మార్గశిర మాసం చివరి ఆదివారాన్ని పురస్కరించుకుని ఆలయం తోటబావి ప్రాంగణంలో సర్వాంగసుందరంగా ముస్తాబు చేసిన ప్రత్యేక మండపంలో మల్లన్న.. మేడలాదేవీ, కేతలమ్మను వివాహమాడారు. ఆర్‌జేసీ రామకృష్ణారావు పర్యవేక్షణలో ఆలయ ఈవో బాలాజీశర్మ, ప్రత్యేకాధికారి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వీరశైవ ఆగమ పండితులు కల్యాణాన్ని కనుల పండువగా జరిపారు. మల్లన్న కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలిరావడంతో కొమురవెల్లి పరిసరాలు కిక్కిరిసిపోయాయి. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి సందర్భంగా ప్రభుత్వం సంతాప దినాలు పాటిస్తున్న నేపథ్యంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు కాకపోవడంతో వీర శైవార్చకులే పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. కాగా, 1045 గంటలకు మల్లన్న కల్యాణం జరగాల్సి ఉండగా, 2 గంటలపాటు ఆలస్యమవడం పట్ల భక్తులు అసహనం వ్యక్తం చేశారు.



# ఉపాధి పథకంలో తక్కువ వేతనాలు

- పార్లమెంటరీ కమిటీ పెదవి విరుపు
- పనిదినాలు పెంచాలని సూచన
- వేతనాలు సవరించాలని సిఫారసు

2లో





2లో

# పులి తిరుగుతోంది.. జాగ్రత్త

- వరంగల్ జిల్లాలో పులి సంచారంపై అధికారుల సూచన
- పెద్దపులి పాదముద్రలు గుర్తించిన అటవీ అధికారులు
- నర్సంపేట ఏజెన్సీ పల్లెల్లో ప్రజల ఆందోళన

## కాంగ్రెస్ పార్టీ స్వీయ సమీక్ష చేసుకోవాల్సిందే

- సీనియర్ నాయకులకు ఎలాంటి గౌరవం దక్కిందో చూశాంప్రణబ్‌ముఖర్జీ కుమార్తె శర్మిష్ఠా విమర్శలు

ఢిల్లీ: ప్రణబ్‌ముఖర్జీ కన్నుమూసినప్పుడు ఆయన పార్థివదేహానికి తగిన గౌరవం ఇవ్వలేదని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీపై ఆయన కుమార్తె శర్మిష్ఠా ముఖర్జీ వరుస ఆరోపణలు చేస్తున్నారు. తాజాగా ఆదివారం ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ విధానాలు, అనుసరిస్తున్న సంప్రదాయాలపై స్వీయ సమీక్ష అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుత అగ్రనాయకుల



2లో

## ఈ ఏడాది.. పిల్లల పాలిట పెనుశాపమే!

- 2024లో నిరాశ్రయులుగా లక్షలాది బాలలు
- యునిసెఫ్ నివేదికలో ఆందోళనకర అంశాలు

పిల్లల పాలిట చరిత్రలో ఎన్నడూ లేనంతటి దారుణ సంవత్సరంగా నిలిచింది 2024. యుద్ధాలు, ఘర్షణల కారణంగా ప్రపంచవ్యాప్తంగా బాలలు భారీ సంఖ్యలో నిరాశ్రయులయ్యారు.

తరువాయి 2లో



# ఐక్యతా మహా కుంభ్

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ''ఇది మనందరికీ గర్వకారణం. రాజ్యాంగం వల్లే ఈ రోజు నేనీ స్థాయికి చేరుకున్నా. మన రాజ్యాంగం ప్రతి సందర్భంలోనూ కాల పరీక్షకు నిలిచింది. దారిదీపంగా, మార్గదర్శిగా ముందుకు నపుడుతోంది'' అన్నారు.

*** అక్కినేనితో కొత్త శిఖరాలకు తెలుగు సినిమా**

సినీ దిగ్గజం అక్కినేని నాగేశ్వరరావు తెలుగు సినిమాను కొత్త శిఖరాలకు చేర్చారంటూ మోదీ ప్రశంసించారు. భారతీయ సంప్రదాయాలు, విలువలను ఆయన సినిమాలు ప్రతిబింబించాయని కొనియాడారు. ''ఈ ఏడాది ఆయనతో పాటు రాజ్ కపూర్, తపన్ సిన్హా, మహ్మద్ రఫీ వంటి సినీ ఉద్దండుల శత జయంతి వేడుకలు జరగడం హర్షణీయం. సృజనాత్మక రంగంలో మన ప్రతిభా పాటవాలను ప్రపంచానికి తెలిపేలా వచ్చే ఫిబ్రవరి 5 నుంచి 9వ తేదీ దాకా ఢిల్లీలో తొలిసారిగా వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమిట్ (వేవ్స్) జరగనుంది. ప్రపంచ దేశాల నుంచి అగ్రశ్రేణి కంటెంట్ క్రియేటర్లు అందులో పాల్గొంటారు. గ్లోబల్ కంటెంట్ క్రియేషన్‌లో ఇండియాను కేంద్రస్థానంగా మార్చే దిశగా ఈ సదస్సు మనకు చాలా కీలకం'' అని తెలిపారు. ఇండియా ఆర్థిక వ్యవస్థను 5 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చడంలో కంటెంట్ క్రియేటర్లు చురుకైన పాత్ర పోషించాలన్నారు. దేశ ప్రజలందరికీ మోదీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆరోగ్యంగా, సంతోషంగా 'ఫిట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# ఉపాధి పథకంలో తక్కువ వేతనాలు

న్యూఢిల్లీ : మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కార్మికులకు తక్కువ వేతనాలు లభిస్తుండడంపై పార్లమెంటరీ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. కార్మికుల వేతనాలు సవరించాలని, వాటిని ద్రవ్యోల్బణ రేటుకు అనుగుణంగా ధరల సూచీతో అనుసంధానం చేయాలని సూచించింది. గ్రామీణాభివృద్ధిపై ఏర్పాటు చేసిన కమిటీ ఉపాధి హామీ పథకం వేతన రేటుపై ఇటీవల లోక్‌సభకు తన నివేదికను అందజేసింది. పథకంలో కనీస పనిదినాలను 100 నుంచి 150కి పెంచాలని కూడా కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి ఉలకా నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ సిఫారసు చేసింది. 2006లో ఉపాధి హామీ పథకం ప్రారంభమైంది. అప్పటి నుంచి 201112 వరకూ రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన కనీస వేతనాల ఆధారంగానే వేతన రేటును నిర్ణయించారు. 201112 నుంచి వ్యవసాయ కార్మికుల వినియోగ ధరల సూచీ (సిపిఐఎఎల్)ని ఉపయోగించి కేంద్ర ప్రభుత్వమే వేతన రేట్లను నిర్ణయించడం మొదలు పెట్టింది. ఈ సూచీ ఆహార వస్తువులకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. అయితే గ్రామీణ ప్రాంత వినియోగ ధరల సూచీ (సిపిఐ రూరల్) ఆధారంగా కార్మికుల వేతనాలను నిర్ణయిస్తే సబబుగా ఉంటుందని 2015లో ఆర్థికవేత్త మహేంద్ర దేవ్ నేతృత్వంలో ఏర్పడిన కమిటీ, 2018లో గ్రామీణాభివృద్ధి శాఖ సీనియర్ అధికారి నగేష్ సింగ్ నేతృత్వంలో ఏర్పడిన మరో కమిటీ అభిప్రాయపడ్డాయి. ద్రవ్యోల్బణ ప్రభావం నుండి ఈ సూచీ వేతనాలకు రక్షణగా నిలుస్తుందని తెలిపాయి. ఆహార, ఇతర సేవలపై పెట్టే వ్యయాలకు ఈ సూచీ సమాన ప్రాధాన్యత ఇస్తుందని చెప్పాయి. ఏ పనికైనా రోజుకు కనీసం రూ.375 వేతనం ఇవ్వాలని 2018లో కార్మిక ఆర్థికవేత్త అనూప్ శతపతి నేతృత్వంలో ఏర్పడిన కమిటీ సిఫారసు చేసింది. కాగా ఉపాధి పథకం కార్మికులకు ప్రస్తుతం నామమాత్రపు వేతనాలు ఇస్తున్నారని, అవి కూడా ఆలస్యంగా అందుతున్నాయని పార్లమెంటరీ కమిటీ ఎత్తిచూపింది. కార్మికుల వలసలకు ఇది కూడా ఓ కారణమని తెలిపింది. ప్రతి కుటుంబానికీ ఏడాదికి కనీసం 150 పనిదినాలు కల్పించాలన్న పౌర సమాజ బృందాల డిమాండుకు కమిటీ గతంలోనే మద్దతు తెలిపింది. పనిదినాలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అనుమతి ఇచ్చామని గ్రామీణాభివృద్ధి శాఖ పార్లమెంటరీ కమిటీకి తెలియజేసింది. అయితే అదనపు పనిదినాలకు చెల్లించే వేతనాల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలే భరించాల్సి ఉంటుంది. ఈ సమాధానంపై పార్లమెంటరీ కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది. చట్ట సవరణ ద్వారా పనిదినాలను పెంచి, ఆ నిబంధనను దేశంలోని అన్ని రాష్ట్రాలకూ వర్తింపజేయాల్సింది గ్రామీణాభివృద్ధి శాఖేనని స్పష్టం చేసింది. ఆధార్ ఆధారిత చెల్లింపుల విధానాన్ని తప్పనిసరి చేయకూడదని, దానికి బదులు ప్రత్యామ్నాయ యంత్రాంగాన్ని రూపొందించాలని కూడా కమిటీ సూచించింది.

# ఈ ఏడాది.. పిల్లల పాలిట పెనుశాపమే!

(మొదటిపేజీ తరువాయి)

ఏకంగా 47.3 కోట్ల మంది బాలలు సంఘర్షణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ఆరుగురిలో ఒకరి కంటే ఎక్కువ మంది కల్లోల ప్రాంతాల్లో నివసిస్తున్నారు.

ఒకప్పుడు పేదరికం, కరువు, వంటివాటితో అల్లాడే పిల్లలు ఇప్పుడు ఘర్షణల్లో సమిధలవుతున్నారు. చదువు మాట అటుంచి వారికి పోషకాహారమే గగనమైపోయింది! గాజా, సూడాన్, ఉక్రెయిన్ సహా ప్రపంచవ్యాప్తంగా ఘర్షణలతో బాలలు విపరీతంగా సతమతమవుతున్నట్టు ఐరాస బాలల సంస్థ యునిసెఫ్ తాజాగా పేర్కొంది. గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో 15 నెలల్లో కనీసం 17,492 మంది బాలలు మరణించినట్లు తెలిపింది...!

మునుపెన్నడూ లేనంతంగా ఎక్కువ మంది పిల్లలు సంఘర్షణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. బలవంతంగా నిరాశ్రయులవుతున్నారు. ఘర్షణలో మరణిస్తున్న, గాయపడుతున్న పిల్లల సంఖ్య పెరిగింది. పాఠశాలలపై బాంబుల వర్షం కురుస్తోంది. ఇళ్లు ధ్వంసమయ్యాయి. కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయి.

భద్రత మాట పక్కకు పెడితే.. ప్రాథమిక అవసరాలు తీర్చుకునే అవకాశమూ ఉండటం లేదు. వాళ్లు ఆడుకోవడం, నేర్చుకోవడం ఎప్పుడో మరిచారు. ఈ యుద్ధాలు పిల్లల హక్కులను హరిస్తున్నాయి. ఇక, ప్రాణాలను కాపాడే వ్యాక్సిన్లు, పోషకాహారం విలాసంగా మారాయి. ''ప్రపంచంలో అనియంత్రిత యుద్ధాలకు ఒక తరం పిల్లలు బలవుతున్నారు. యుద్ధ ప్రాంతాల్లోని పిల్లలు మనుగడ కోసం పోరాటమే చేస్తున్నారు. దానికి తమ బాల్యాన్ని పణంగా పెడుతున్నారు. సర్వహక్కులు కోల్పోతున్నారు. ఇది దారుణం'' అని యునిసెఫ్ డైరెక్ట్ కేథరిన్ రస్సెల్ వాపోయారు.

**గణాంకాలు చెబుతున్న విషాదాలు..**

యునిసెఫ్ నివేదిక ప్రకారం ప్రపంచ జనాభాలో పిల్లలు 30 శాతం ఉన్నారు. వారిలో 47.3 కోట్ల మంది యుద్ధ ప్రభావింత ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ప్రతి ఆరుగురిలో ఒకరు సంఘర్షణ ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్నారని అంతర్జాతీయ ఏజెన్సీ తెలిపింది. 1990లలో సుమారు 10 శాతం మంది బాలలు సంఘర్షణ ప్రాంతాల్లో ఉండగా ఇప్పుడది ఏకంగా రెట్టింపుకు, అంటే 19 శాతానికి పెరిగింది. ఈ యుద్ధాల కారణంగా 2023 చివరి నాటికి 4.7 కోట్ల మంది పిల్లలు నిర్వాసితులయ్యారు. 2024లో హైతీ, లెబనాన్, మయన్మార్, పాలస్తీనా, సూడాన్ నుంచి అత్యధికంగా శరణార్థులుగా వెళ్లారు. ప్రపంచ శరణార్థుల జనాభాలో సుమారు 40 శాతం బాలలే. ఆయా దేశాల్లో నిర్వాసితులయినవారిలో బాలలు 49 శాతమున్నారు. 2023 నుంచి ఇప్పటిదాకా 22,557 మంది పిల్లలపై రికార్డు స్థాయిలో 32,990కు పైగా తీవ్రమైన హక్కుల ఉల్లంఘనలు జరిగాయి. ముఖ్యంగా బాలికల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. సంఘర్షణ ప్రాంతాల్లో అత్యాచారాలు, లైంగిక హింస పెచ్చరిల్లాయి.

*** ప్రమాదకర స్థాయిలో**

యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో విద్యకు తీవ్ర అంతరాయం కలిగింది. సంఘర్షణ ప్రభావిత దేశాలలో 52 మిలియన్లకు పైగా పిల్లలు పాఠశాలకు దూరంగా ఉన్నారు. విద్యా మౌలిక సదుపాయాల విధ్వంసం, పాఠశాలల సమీపంలో అభద్రతా భావం వల్ల ఈ ప్రాంతాల్లో పరిస్థితులు మరింత దిగజారాయి. ఈ పిల్లల్లో పోషకాహార లోపం కూడా ప్రమాదకర స్థాయికి పెరిగింది. యుద్ధం పిల్లల ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. యుద్ధాలు జరుగుతున్న దేశాల్లోని పిల్లల్లో 40శాతం మంది టీకాలు అందడం లేదు. వారి మానసిక ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావం పడుతోంది. హింస, విధ్వంసం, కుటుంబ సభ్యులను కోల్పోవడం వల్ల పిల్లల్లో నిరాశ పెరిగింది. పిల్లల్లో ఆగ్రహావేశాలు పెరిగాయి.

# జనవరి రెండో వారంలో రాష్ట్రానికి 'కాళేశ్వరం' కమిషన్!

హైదరాబాద్: కాళేశ్వరంపై న్యాయ విచారణలో భాగంగా జనవరి రెండో వారంలో కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ రాష్ట్రానికి రానున్నట్లు సమాచారం. కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోని పలు అవకతవకలపై కమిషన్ విచారణ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే సాంకేతిక, ఆర్థిక పరమైన అంశాలపై కమిషన్ విచారణ పూర్తిచేసింది. ఈ నెలలో నిర్వహించిన బహిరంగ విచారణలో పలువురు తాజా, మాజీ ఐఏఎస్‌లను కూడా విచారించింది. తదుపరి విచారణను మరింత విస్తృతం చేసే అవకాశాలున్నాయి. కీలక వ్యక్తులకు ఈ దఫా నోటీసులు జారీ చేయనున్నట్లు సమాచారం. ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, విద్యుత్ సంస్థల ఇంజినీర్ రఘులను విచారించనున్నారు. వారు సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా బహిరంగ విచారణ పూర్తిచేసి అభిప్రాయాలను నమోదు చేయనున్నారు. బ్యారేజీల నిర్మాణసంస్థల ప్రతినిధులతోపాటు గతంలోనే విచారణ పూర్తయిన ఒకరిద్దరు మాజీ ఈఎన్సీలను మరోమారు విచారణకు పిలిచే అవకాశాలున్నట్లు సమాచారం. ఈ నెలతో కమిషన్‌కు ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగియనుండగా మరో రెండు నెలల పాటు (ఫిబ్రవరి వరకు) పొడిగిస్తూ ఇటీవలే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో వచ్చే నెల 16 లేదా 17వ తేదీల్లో జస్టిస్ ఘోష్ మరో విడత విచారణను ప్రారంభించే అవకాశాలున్నట్లు సమాచారం.

## నేడు శాసనసభ ప్రత్యేక భేటీ

(మొదటిపేజీ తరువాయి)

పడనుంది. కాగా, సోమవారం జరిగే అసెంబ్లీ సమావేశాల ఏర్పాట్లను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అసెంబ్లీ కార్యదర్శి వి.నర్సింహాచార్యులు ఆదివారం పరిశీలించారు. సభ నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ సిబ్బందిని స్పీకర్ ఆదేశించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ జితేందర్‌లతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడిన స్పీకర్.. సమావేశాల నిర్వహణకు అవసరమైన సహకారాన్ని అందించాలని కోరారు. అది మన బాధ్యత.. ఎంపీ మల్లురవి: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను స్మరించుకోవడం మన బాధ్యత అని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి అభిప్రాయపడ్డారు. ఆయనను గుర్తు చేసుకునేందుకోసం అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినందుకు మల్లు రవి.. సీఎం రేవంత్‌రెడ్డికి ఆదివారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. గొప్ప మేధావికి తెలంగాణ రాష్ట్రం ఇస్తున్న నివాళిగా ఈ సమావేశం నిలిచిపోతుందని మల్లు రవి పేర్కొన్నారు.

## జనవరిలోగా బీజేపీకి కొత్త అధ్యక్షుడు!

(మొదటిపేజీ తరువాయి)

*** నడ్డా దిశా నిర్దేశం**

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 100వ జయంతిని ఏడాది పొడవునా నిర్వహించడం, దేశంలోని వివిధ ప్రదేశాలలో అటల్‌జీ జీవితానికి సంబంధించిన సామాజిక కార్యక్రమాలు, ప్రదర్శనలు నిర్వహించడంపై నడ్డా దిశానిర్దేశం చేశారు. వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలో తీసుకున్న ప్రధాన నిర్ణయాలు, విజయాలు, ప్రధానంగా కార్గిల్ యుద్ధం, ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన, పోఖ్రాన్ అణు పరీక్ష, స్వర్ణ చతుర్భుజి జాతీయ రహదారి ప్రాజెక్ట్, కిసాన్ క్రెడిట్ కార్డ్ వంటి విజయాలను ప్రదర్శించనున్నారు. ఇలావుండగా వివాదాస్పద అంశాలపై ప్రకటనలు, వ్యాఖ్యలకు పార్టీ నేతలు దూరంగా ఉండాలని పార్టీ అధిష్టానం సూచించింది.

## పులి తిరుగుతోంది.. జాగ్రత్త

నర్సంపేట: వరంగల్ జిల్లాలో పులి సంచారం వార్త ప్రజలను భయాందోళనకు గురి చేస్తోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో పెద్దపులి పాదముద్రలను గుర్తించిన అధికారులు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా వ్యవసాయ పనులకు వెళ్లొద్దని సూచిస్తున్నారు. ఇటీవల ఆదిలాబాద్ జిల్లా నుంచి ఉమ్మడి వరంగల్‌లోకి ప్రవేశించిన పెద్దపులి నల్లబెల్లి, ఖానాపురం, నర్సంపేట ఏజెన్సీ పల్లెల్లో తిరుగుతున్నట్లు ఆనవాళ్లు గుర్తించారు. మూడు రోజుల క్రితం నల్లబెల్లి మండలం రుద్రగూడెం సమీప అడవిలో పులి తిరిగింది. స్థానికుల సమాచారంతో అటవీ అధికారులు పులి పాద ముద్రలు పరిశీలించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో చాటింపు చేశారు. తర్వాత ఖానాపురం మండలంలో కూడా పులి సంచరించినట్లు సమాచారం రాగా అధికారులు స్థానికులకు జాగ్రత్తలు చెప్పారు. ఆదివారం నర్సంపేట మండల పరిధిలోకి పెద్దపులి వచ్చినట్లు తెలియడంతో ఇక్కడి పల్లెల్లో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా పశువులు, గొర్రెలు, మేకలను అటవీ ప్రాంతానికి తీసుకెళ్లే కాపరులు కొద్ది రోజులు మైదాన ప్రాంతాల్లోనే మేపుకోవాలని నర్సంపేట ఇన్‌స్పెక్టర్ రమణమూర్తి సూచించారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని, గుంపులుగా వెళ్లి పనులు త్వరగా ముగించుకొని సాయంత్రం కాక ముందే ఇళ్లకు చేరుకోవాలని చెప్పారు.

**డ్రోన్ కెమెరాలతో..**

మూడు రోజులుగా నల్లబెల్లి మండలంలో సంచరిస్తున్న పెద్ద పులి రుద్రగూడెం, కొండాయిపల్లి శివారులోని పలుగు ఏనే (కొండ ప్రాంతం) నుంచి అటవీ బాట పట్టింది. పులి పాదముద్రల ఆధారంగా అది మహబూబాబాద్ జిల్లా పరిధిలోని అటవీ ప్రాంతానికి వెళ్లినట్లు ఫారెస్ట్ అధికారులు నిర్ధారించారు. రుద్రగూడెం, కొండాయిల్‌పల్లి గ్రామస్తుల అభ్యర్థన మేరకు నర్సంపేట ఎఫ్ఆర్ఓ రవికిరణ్ పర్యవేక్షణలో అటవీ సిబ్బంది.. డ్రోన్ కెమెరా సహాయంతో పలుగు ఏనే ప్రాంతాన్ని చిత్రీకరించి పరిశీలించారు. ఇక్కడే పులి సేద తీరినట్లు ఎఫ్ఆర్ఓ తెలిపారు. కాగా, పెద్దపులి అటవీ ప్రాంతానికి తరలివెళ్లినట్లు స్పష్టం కావడంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## కాంగ్రెస్ పార్టీ స్వీయ సమీక్ష చేసుకోవాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

వ్యవహారశైలి, వారిలో సరైన భావజాలం లోపించడంతో ఒకప్పటి సీనియర్ నాయకులు పార్టీకి దూరంగా ఉంటున్నారని తెలిపారు. తన తండ్రి కన్నుమూసినప్పుడు సీడబ్ల్యూసీ ఎందుకు సమావేశం కాలేదని ఆమె మరోసారి ప్రశ్నించారు. 'కాంగ్రెస్ నా ప్రశ్నకు సమాధానం చెప్పి తీరాల్సిందే. వారు ఉద్దేశపూర్వకంగానే విస్మరించారా లేదా నిర్లక్ష్యంతో వ్యవహరించారా అనేది నాకు తెలియదు. పురాతన పార్టీ అని చెప్పుకొనే పార్టీలో ఇవేం సంప్రదాయాలు?' అని శర్మిష్ఠ ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీయేతర నాయకులు మరణించినప్పుడు వారికి ఎలాంటి గౌరవం దక్కిందో తాము చూశామని చెబుతూ పీవీ నరసింహారావు ఉదంతాన్ని ఆమె ఉదహరించారు.

# రైతు భరోసా సొమ్ము ఇచ్చి తీరుతాం

హైదరాబాద్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతుభరోసా సొమ్మును రైతులకు ఇచ్చి తీరుతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు రూ.72,659 కోట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఆదివారం సచివాలయంలో రైతు భరోసా మంత్రివర్గ ఉపసంఘం ఛైర్మన్ భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రులు, కమిటీ సభ్యులైన తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు అధికారులతో సమావేశమై చర్చించారు. ప్రస్తుత యాసంగి సీజన్లో రైతు భరోసాకు అర్హులను గుర్తించడానికి ఖరారు చేయాల్సిన విధి విధానాలపై రెండు గంటల పాటు మంత్రులు కసరత్తు చేశారు. గతంలో రైతుబంధు పథకం అమలైన తీరు, రాష్ట్రవ్యాప్తంగా పర్యటించినప్పుడు రైతులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు, అధికారులు సేకరించిన సమాచారంపై మంత్రులు చర్చించారు. త్వరలో విధివిధానాలు విడుదల చేయాలని ఉపసంఘం నిర్ణయించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 202324 యాసంగి పంటకు పెట్టుబడి సాయంగా గత జనవరిలో రైతు భరోసా కింద 1,57,51,000 ఎకరాలకు రూ.7,625 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పంటల బీమా పథకానికి, రైతు జీవితబీమా పథకానికి ప్రీమియం మొత్తాన్ని రైతుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. 202425లో రాష్ట్రంలో లక్ష ఎకరాల ఆయిల్‌పాం పంట సాగును చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని సాయం కింద రూ.133.50 కోట్లు విడుదల చేసినట్టు భట్టి విక్రమార్క వివరించారు.



## శివచరణ్ రెడ్డిని కలిసిన యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఎన్నికలలో అత్యధిక మెజారిటీతో ఘన విజయం సాధించిన జక్కిడి శివ చరణ్ రెడ్డిని యూత్ కాంగ్రెస్ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు రంజాన్ నరేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా శివ చరణ్ రెడ్డికి ఆయన శాలువా కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం ఈ సందర్భంగా వారు చర్చించారు.

## జిల్లా అధ్యక్షుడు ఉదయ్ ని పరామర్శించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : ఇటీవల మరణించిన ఇమంది కళ్యాణ్ కృష్ణ కుటుంబ సభ్యులను టి యు డబ్ల్యు జే ఐ జే యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ పరామర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టియూడబ్ల్యూజే ఐజేయు అధ్యక్షుడు ఇమంది ఉదయ్ కుమార్ కు కళ్యాణ్ కృష్ణ సోదరుడు. 26వ తేదీ ఉదయం హఠాత్తుగా గుండెపోటు రావడంతో హైదరాబాదు వారాసిగూడలో కళ్యాణ్ కృష్ణ మరణించారు. ఈ నేపథ్యంలో ఆయన భౌతికకాయాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంనకు తీసుకువచ్చి కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామనారాయణ కళ్యాణ్ కృష్ణ సోదరులు ఉదయ్ కుమార్, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అన్నివేళలా యూనియన్ అండగా ఉంటుందని అధైర్యపడవద్దని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జనుమాల రమేష్, బివి రమణారెడ్డి, ముబగాపు ఆనంద్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, ఏర్పుల సుధాకర్, జానీ, కోలా కుమార్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు సేవలందించడం అభినందనీయం

* బాలానగర్ ఏసీపీ హనుమంతరావు

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : నిరుపేదలకు సేవలందించడం



అభినందనీయమని బాలానగర్ ఏసీపీ హనుమంతరావు అన్నారు. హైదరాబాద్ నగరంలో ఫూట్పాత్ మీద, విశ్రాంతి భవనాలలో, ఇతర షెల్టర్లలో ఇంతటి చలిలో కనీసం కప్పుకోవడానికి దుప్పట్లు కూడా లేకుండా నిద్రిస్తున్నటువంటి నిరుపేదలకు ఎంతో దాతృత్వ గుణంతో ఆదివారం హెచ్ఎంటి శాతవాహన నగర్ వాకింగ్ గ్రూప్ పెద్దలు , సామాజిక సేవా ప్రదాత, బివిఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ బొమ్మారెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో దుప్పట్లు కప్పి చలికి అలమటిస్తున్న వారి పట్ల చూపిన ప్రేమాభిమానాలకు నగరంలోని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయనతో పాటు రిటైర్డ్ ఎస్పీ సురేందర్ రెడ్డి లు పాల్గొని అభినందించారు. ఈ కార్యక్రమంలో వాకింగ్ గ్రూప్ సభ్యులు రాధాకృష్ణ, వాకింగ్ గ్రూప్ ప్రెసిడెంట్ రామ్మోహన్ రావు, జగన్మోహన్ రావు, హనుమంత రావు,బి.వి.ఆర్ యూత్ ప్రెసిడెంట్ శ్యామ్, ఇతర వాకింగ్ గ్రూప్ సభ్యులు బీవీఆర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




రాజన్న సిరిసిల్ల, (ప్రజాస్ఫూర్తి) : రాజన్న సిరిసిల్లలోని విజ్ఞాన వర్ధిని హై స్కూల్ ఎస్ఎస్సి 2002 2003 సంవత్సర పూర్వ విద్యార్ధిని విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 21 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో స్కూల్ ప్రిన్సిపల్ మందాడి భాస్కరరెడ్డి తో పాటు ఇతర ఉపాధ్యాయులు , విద్యార్థులు అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులు గురువులకు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమం కోఆర్డినేటర్ వేణు, అజీం పాషా ,పల్లవి అండ్ టిం కి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

# మరణించినా ప్రజల హృదయాల్లో నిలిచిఉండేది కమ్యూనిస్టులే

* సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం:నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అజరామరమైన పోరాటాలు సాగించి అమరులైన కమ్యూనిస్టులు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఉంటారని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం నియోజకవర్గం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం సింగరేణి కార్మిక ప్రాంతం రామవరం లో బరిగెల సాయిలు, 6వ వర్ధంతి సందర్భంగా వారు స్థూపం వద్ద సాయిలుకు ఆయన పాల్గొని ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెత్తందారుల కబంధ హస్తాల్లో నలుగుతూ పెట్టుబడి దారుల కుహన కుట్రలకు బలవుతున్న నిర్భాగ్యుల వెంట ఎప్పుడు ఎర్రజెండా ఉంటుందన్నారు. కార్మిక రంగంలో సాయిలు చేసిన కృషి అజరామరమైంది అని కొనియాడారు. బరిగెల సాయిలు సేవలు భారత కమ్యూనిస్టు పార్టీ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ మరవలేమని,అనతి కాలంలోనే మంచి నాయకులను కమ్యూనిస్టు పార్టీ కోల్పోవడం దురదృష్టకరమన్నారు. భారత కమ్యునిస్టు పార్టీకి తీరని లోటుగా భావిస్తూ, అమరుల ఆశయ సాధన కోసం మరింత కృషి చేయాలని వారు కోరారు బరిగెల సాయిలు సతీమణి సిపిఐ మహిళా సమైక్య జిల్లా గౌరవ అధ్యక్షురాలు బరిగల సంపూర్ణ, సిపిఐ యువజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాయకుడు బరిగెల భూపేష్, కుమార్తె పద్మలత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు కంచర్ల జమాలయ్య ,మునిగడప పద్మ, వెంకటేశ్వర్లు , భూక్యా శ్రీనివాస్, మాటేడు గోపాల్, మాతంగి లింగయ్య,ఎస్.కె.. ఫహీం , ఖయ్యూం , మర్రి గోపికృష్ణ, గోపి, షేక్ జలీల్, గురు మూర్తి , ఎర్రబెల్లి శంకర్, దాట్ల శ్రావణ్, కుమ్మరి మధు,అశోక్, కుమార్, ఉర్సు శ్రావణ్, దిలీప్,ఈ. రామస్వామి, సిహెచ్ సారంగపాణి, కొరిమి సురేష్, మహిళా సమైక్య జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కె రత్నకుమారి, ఎం ధనలక్ష్మి,షేక్ షాహీన్ , మద్దెల విజయలక్ష్మి, మెహబూబీ, దళిత సంఘాల నాయకులు కొత్తూరు మదనయ్య, కూరగాయల శ్రీనివాస్ ,ఐ శంకర్, ఇల్లందుల పోచయ్య, చాట్ల రామారావు, బరిగెల స్వామి,నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరిలో ఐజేయు భద్రాద్రి జిల్లా మహాసభ

* ఆరుగురు సభ్యులతో మానిటరింగ్ కమిటీ ఏర్పాటు
* టీయుడబ్ల్యుజే(ఐజేయూ) కార్యవర్గ సమావేశం తీర్మానం







ప్రజాస్ఫూర్తి, భద్రాద్రికొత్తగూడెం: 2025 ఫిబ్రవరి నెలలో టీయూడబ్ల్యుజే (ఐజేయూ)భద్రాద్రికొత్తగూడెం జిల్లా మహాసభను నిర్వహించాలని తీర్మానం చేశారు. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆదివారం పలు తీర్మానాలు చేశారు. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో మహాసభలను నిర్వహించాలని, ముందుగా జనవరి 20 నుంచి 30వ తేదీ వరకు అన్ని మండలాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం పూర్తిచేయాలని, మహాసభల నిర్వహణకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇమంది ఉదయ్ కుమార్, మొబగాపు ఆనందుమార్లతో పాటు జాతీయ కౌన్సిల్ సభ్యులు దుద్దుకూరి రామారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జునమాల రమేష్, బి.వి.రమణారెడ్డి, కోడూరి సత్యనారాయణతో కూడిన మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేస్తూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా టీయుడబ్ల్యుజే (ఐజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ మాట్లాడుతూ...జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతుందని వెల్లడించారు. ఇండ్ల స్థలాలు, అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డులు కోసం ప్రభుత్వంతో చర్చలు జరిపినట్లు వివరించారు. హైదరాబాదులో జర్నలిస్టుల సొసైటీలకు ఇచ్చిన ఇండ్ల స్థలాలను సుప్రీంకోర్టు తప్పుబట్టి నిలిపివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దీనిపై ఐజేయూ ఆధ్వర్యంలో లీగల్గా ఫైట్ చేస్తున్నట్లు తెలిపారు. చెన్నై, పాండిచ్చేరీ, చండీఘర్,డెహ్రాడూన్, పాట్నాలో జరిగిన ఐజేయూ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో మీడియా కమిషన్, వేజ్ బోర్డు వంటి అంశాలపై చర్చ జరిగినట్లు చెప్పారు. ప్రతీ ఒక్కరూ ఉత్తమ జర్నలిస్టులుగా పనిచేయాలనేది యూనియన్ ఉద్దేశ్యమని, పౌరసమాజాన్ని కూడగట్టుకుని పేదల అభ్యున్నతికి వార్తలు రాయాలని ఆయన సూచించారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో యూనియన్ బలోపేతం కోసం మండల స్థాయి నుంచి సంఘ నిర్మాణం చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు కనుకు వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ సత్యానంద్, గిరి ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏర్పుల సుధాకర్ రావు, పెండ్యాల భాస్కరరావు , చంద్రశేఖర్, జానీ, చారు గుండ్ల రమేష్ ,కోటిరెడ్డి కార్యవర్గ సభ్యులు, జిల్లాలోని పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## కనకదుర్గ ఆలయంలో వైభవంగా లక్ష కుంకుమార్చన



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : మార్గశిర బహుళ చతుర్దశి తిథిని పురస్కరించుకుని హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట రోడ్డులో గల కనకదుర్గ ఆలయంలో లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ,కామాక్షి బ్రాహ్మణ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఆలయంలో దుర్గామాత అష్టోత్తర, సహస్రనామావళి నడుమ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా నిజాంపేట, సమతానగర్ , శ్రీనివాస్ నగర్ సహా పలు ప్రాంతాలకు చెందిన సుమారు 500 మంది మహిళలు ఈ కుంకుమార్చనలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణను చేపట్టారు. ఈ కార్యక్రమంలో భువనేశ్వరి మారేపల్లి, కల్యాణి, వెంకటరమణి, బాలపరమేశ్వరి, అచ్యుతకుమారి, జయశ్రీ, ఛాయాదేవి, దుర్గాభవాని, పార్వతి, అనిత, గౌరి, మణి , కామాక్షి బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మాటలే తనకు స్ఫూర్తి

* కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మాటలే తనకు స్ఫూర్తి అని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 1 నందు ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ మాట్లాడుతూ నీకోసం జీవిస్తే నీలోనే నిలిచిపోతావు అదే జనం కోసం జీవిస్తే జనంలో నిలిచిపోతావు అని చాటిన మహానుభావుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఎంతో దూరదృష్టితో రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 3 ద్వారా తెలంగాణ రాష్ట్రం సాధించ గలిగామన్నారు. మహిళలకు అందుతున్న రిజర్వేషన్లు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం సాధ్యమైందన్నారు. మహనీయులు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గౌరవార్థం 125 అడుగుల బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి వారికి సముచిత స్థానం కల్పించిన ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. ఇప్పటికే దాదాపు 16 మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేస్తూ సమాజానికి పూర్తిగా నిలిచిన అంబేద్కర్ విగ్రహ దాత మేకల నాగేష్ ను ఎమ్మెల్యే అభినందించారు.ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్ రాజ్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్ అవుల పావని జగన్ యాదవ్, గాజుల సుజాత, సీనియర్ నాయకులు చంద్రగిరి సతీష్, సాంబశివారెడ్డి, బిక్షపతి, ముత్యాలు, జలగం చంద్రయ్య, అంబేద్కర్ సంఘం గౌరవ అధ్యక్షులు కుంటపల్లి రమేష్, అధ్యక్షులు దాసరి మల్లేష్, ఉపాధ్యక్షులు మూరకొండ మధు, ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి దాదిమాల సూరి, దేవరాయ యాదగిరి, దేవరాయ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా

* ప్రెస్ అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డి



జనగామ, (ప్రజాస్ఫూర్తి) : జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని ప్రెస్ అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జనగామ పట్టణంలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. జనగామ జిల్లా జర్నలిస్టులు. ఐజేయు జిల్లా అధ్యక్షులు ఇర్రి మల్లారెడ్డి ఆధ్వర్యంలో మీడియా అకాడమీ చైర్మన్ ని కలిసిన జర్నలిస్టులు తమ సమస్యలను విన్నవించారు. దీంతో సానుకూలంగా స్పందించిన చైర్మన్ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంతో పాటు అందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అందజేయడానికి కృషి చేస్తారన్నారు. అర్హులైన జర్నలిస్ట్ లందరికీ అక్రిడేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు లయన్ కన్నా పరుశరాములు, బిట్ల మధు, కాసాని ఉపేందర్, శశిధర్, జర్నలిస్ట్ లు సాగర్, ఫైజల్ తదితరులు పాల్గొన్నారు,

# నేడు శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం 33వ వార్షికోత్సవం

కూకట్ పల్లి , (ప్రజాస్ఫూర్తి) : వివేకానంద నగర్ శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం 33వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 30వ తేదిన ఆలయంలో శ్రీ శివ పార్వతుల కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు గురుస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 30న సాయంత్రం 6.00 గంటలకు కూకట్ పల్లీ పుర వీధుల్లో అయ్యప్ప స్వామి మహా ఊరేగింపు ఉంటుందని తెలిపారు. డిసెంబర్ 31'వ తేదీన ఉదయం 6.00 గంటలకు లక్ష్మీ గణపతి హోమం, ఆరాట్ ఉత్సవం, 18 కలశములతో మహా పడిపూజ అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి ఈ పూజా కార్యక్రమాలలో పాల్గొని, శ్రీ అయ్యప్ప స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలు మరవలేనివి

* **ఆకాంక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిట్నీడి వెంకట రామారావు**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలు మరవలేనివని ఆకాంక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిట్నీడి వెంకట రామారావు అన్నారు. ఆదివారం కూకట్పల్లి మున్సిపల్ పరిధి వివేకానంద నగర్ డివిజన్ ప్రాంతంలోని వివేకానంద విగ్రహం ముందు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సంతాప దినాలలో భాగంగా ఆయన చిత్రపటానికి కోవ్వోత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కి ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు యాకన్న, సామాజిక కార్యకర్తలు చింది బద్రీనాథ్, మణి బాబు, యూసుఫ్, యెషోభు, సాయి కుమార్, నవీన్ కుమార్, విజయ లింగం, రేవని జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

## లింగయత్ సమాజ అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి బసవేశ్వరుడు

* **కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : లింగయత్ సమాజ అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి బసవేశ్వరుడని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ పొలాల బస్తి నందు తెలంగాణ వీరశైవ లింగాయత్ ఆధ్వర్యంలో పూజ గంగా మాతాజీ పర్యవేక్షణలో నిర్వహించిన 38వ బసవ జ్యోతి కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ సమాజంలో అన్ని మతాలు, కులాలు సమానమని, దేవుని దృష్టిలో అందరూ ఒకటేనన్నారు. సమాజంలోని అసమానతలను తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. అనంతరం బసవేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలుకుల జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, నాయకులు నరసింహ, పాపులు గౌడ్, జైహింద్, విఠల్, దాసు, వీరశైవ లింగాయత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు దెంపే కృష్ణ, సంఘ సభ్యులు వీరయ్య స్వామి, సంజు, రన్ వీర్, బసవరాజ్, కపిల్ తదితరులు పాల్గొన్నారు.

## చోరీల నుంచి హత్యల దాకా పైపైకి..!



హైదరాబాద్: రాష్ట్రంలో ఈ ఏడాది చోరీలు.. హత్యలు.. అత్యాచారాలు.. మోసాలు.. సైబర్‌నేరాలు.. ఇలా గుర్తించదగిన నేరాలు (కాగ్నిజబుల్ అఫెన్సెస్) అన్నీ పెరిగాయి. రోడ్డు ప్రమాదాలతోపాటు.. ప్రమాద మరణాల్లోనూ పెరుగుదల నమోదైంది. గత ఏడాదితో పోల్చితే గుర్తించదగిన నేరాల్లో ఈసారి ఏకంగా 22.5 శాతం పెరుగుదల నమోదైంది. గత ఏడాది జనవరి నుంచి నవంబరు వరకు ఈ తరహా నేరాలు 1,38,312 నమోదైతే.. ఈసారి ఇదే కాలానికి 1,69,477 నమోదయ్యాయి. మొత్తంగా అన్ని నేరాలు కలిపి ఈ ఏడాది నవంబరు నాటికి 2,34,158 కేసులు నమోదు కాగా.. గత ఏడాది ఇదే కాలానికి వీటి సంఖ్య 2,13,121. గత ఏడాదికంటే ఇది 9.87 శాతం అధికం. 2024 నేర గణాంకాల వార్షిక నివేదికను డీజీపీ డా.జితేందర్ ఆదివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు.

**గత ఏడాది కన్నా తగ్గిన శిక్షలు**

గత ఏడాది నమోదైన 57,561 కేసులతోపాటు ఈసారి నమోదైన 1,69,477 కేసుల్లో.. 1,55,639 (68.55 శాతం) కేసుల దర్యాప్తు ముగించారు. గత ఏడాది 39,371 కేసుల్లో (36.85 శాతం) శిక్షలు ఖరారు కాగా.. ఈసారి 28,477 కేసుల్లో (35.63 శాతం) మాత్రమే ఖరారయ్యాయి. తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో(టీజీఏఎన్‌బీ) ద్వారా ఈ ఏడాది 1,924 మాదకద్రవ్యాల కేసులు నమోదు చేసి 4,682 మంది నిందితుల్ని అరెస్ట్ చేశారు. రూ.142.95 కోట్ల విలువైన మాదకద్రవ్యాల్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది కుటుంబ కలహాలతోనే అత్యధికంగా 229 హత్యలు నమోదయ్యాయి. వివాహేతర సంబంధ హత్యలు 102, భూ, ఆస్తి తగాదాలతో 82, చిన్నపాటి గొడవలతో 82, ఆర్థిక వివాదాలతో 53 హత్యలు జరిగాయి.

గత ఏడాది మహిళలపై నేరాలు 19,013 నమోదు కాగా.. ఈ ఏడాది 19,922 నమోదయ్యాయి. వీటిలో సగం వరకు వరకట్న వేధింపులవే. అత్యాచారం కేసుల నిందితుల్లో 99.2 శాతం మంది.. బాధితురాళ్లకు తెలిసిన వారేనని తేలింది. మొత్తం 2,945 కేసుల్లో 2,922 మంది ఇలాంటివారే. మైనర్ల అదృశ్యం కేసుల్లో 82 శాతం మందిని తిరిగి గుర్తించారు.

# బ్రాహ్మణులకు అన్ని విధాల తన సహాయ సహకారాలు అందిస్తా

* **కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**





కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : బ్రాహ్మణులకు అన్ని విధాల తన సహాయ సహకారాలు ఎప్పుడూ అందిస్తానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. ఆదివారం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఎమ్మెల్యే కె.పి వివేకానంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం క్యాలెండర్ ను ఆవిష్కరిస్తూ వస్తున్నామన్నారు. క్యాలెండర్ లో తిథి, వార, నక్షత్రాలతో పాటు సామాన్యులకు నిత్యకృత్యాలైన అనేక విషయాలను క్యాలెండర్ లో పొందుపరచడం అందరికి ఎంతగానో ఉపయోగమౌతుందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే వివేకానంద్ ని వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడ్వకేట్ కమలాకర్, శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు గోగులపాటి కృష్ణమోహన్, శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన సలహాదారులు , సీనియర్ రిపోర్టర్ సర్వేపల్లి రమేష్ కుమార్, రామదాసు పరశురామ శర్మ, గురజాడ రంగారావు, ఉపాధ్యక్షులు శ్రీరామ శర్మ చక్రధారి, గద్దం రాంబాబు, కార్యదర్శులు శ్రీధరాచార్యులు, జనమంచి శశికుమార్, సాయిరాం, దుర్గానాగమోహన్, చింతపట్ల వెంకటరమణాచార్యులు, శశాంకాచార్యులు, గోవర్ధన్ రావు, దివాకర్, సూర్యనారాయణ, మహేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

* సూరారం కాలనీ జై శ్రీరామ్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆదివారం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి వేణు ముదిరాజ్, వైస్ ప్రెసిడెంట్ ఎల్. అనిల్ కుమార్, కోశాధికారి రాము ముదిరాజ్, కార్యనిర్వాహక కార్యదర్శి సాయి, వర్కింగ్ ప్రెసిడెంట్ యశ్వంత్ రెడ్డి, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రంగారావు, మాలాద్రి, బంగారయ్య, రామకృష్ణ, ఇతర కార్యవర్గ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.


## స్వర్గీయ పిజెఆర్ ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలి

**: కార్మిక నాయకులు**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : స్వర్గీయ పిజెఆర్ ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోని వారి అడుగుజాడల్లో నడుద్దామని కార్మిక నాయకులు అన్నారు. పిజెఆర్ 17 వ వర్ధంతి పురస్కరించుకొని జీడిమెట్ల పారిశ్రామికవాడలో గల సూపర్ మ్యాక్స్ పరిశ్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి కార్మిక నాయకులతోపాటు,కార్మికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు,కార్మికులు మాట్లాడుతూ నిరుపేద కార్మికుల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల పక్షపాతి మాజీ మంత్రి, సీఎల్పీ నేత, ఐఎన్టీయూసీ దివంగత నేత పి.జనార్ధన్ రెడ్డి అని అన్నారు. సాధారణ కార్మికుడి నుండి కార్మిక నాయకుడిగా,కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక నాయకుడిగా,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మంత్రిగా,సిఎల్పి నాయకులుగా ఎదిగి పేద ప్రజల,కార్మికుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు.కార్మిక యూనియన్ల అగ్ర నేతలు పి.జే.ఆర్,నాయిని నర్సింహా రెడ్డి లేని లోటు స్పష్టంగా కనిపిస్తుందన్నారు. వారు కార్మికుల శ్రేయస్సు కోసం యాజమాన్యంతో మాట్లాడి అగ్రిమెంట్లు చేశారని గుర్తు చేశారు. నిరంతరం శ్రామికుల శ్రేయస్సు కోసం పాటుపడిన వారు లేని లోటు తీర్చలేనిదని ఆవేదన వ్యక్తపరిచారు.ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్దదైన ఖైరతాబాద్ నియోజకవర్గం నుండి ఐదుసార్లు శాసనసభ్యులుగా ఎన్నికై చరిత్ర సృష్టించారన్నారు.చివరి వరకు కార్మికులకు,పేదప్రజలకు సేవ చేయడంలో ముందు ఉండేవారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సూపర్ మాక్స్ కంపెనీ నాయకులు సురేష్,ఈశ్వర్ రెడ్డి, రాంచంద్రారెడ్డి, రాజు, గోపాల్ రెడ్డి, నాయుడు, దయాకర్ ,గణనాథ్, జనార్దన్, సూర్య నారాయణ, సి.ఎచ్.శ్రీనివాస్,చంద్రశేఖర్,కార్మిక సోదర,సోదరిమణులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మికులందరికీ రైతు భరోసా అందజేయాలి



హైదరాబాద్: ఉపాధి హామీకి సంబంధం లేకుండా వ్యవసాయ కార్మికులందరికీ రైతు భరోసా అందించే విషయంలో ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నేతలు కోరారు. ఈ విషయంపై ఆదివారం ప్రజాభవన్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను కలవగా ఆమె సానుకూలంగా స్పందించారని ఒక ప్రకటనలో తెలిపారు. రైతు కూలీల గుర్తింపు, వాటి విధివిధానాలు, వారికి భరోసా వర్తింపు, కౌలు రైతుల గుర్తింపు తదితర అంశాలపై మంత్రితో చర్చించామని వెల్లడించారు. ఉపాధి హామీకి సంబంధం లేకుండా వ్యవసాయ కార్మికులందరికీ రూ.12 వేలు రైతు భరోసా ఇవ్వాలని కోరినట్లు పేర్కొన్నారు. ఈ సమస్యలను మంత్రివర్గం ముందు పెట్టి పరిష్కరించేందుకు కృషి చేస్తానని సీతక్క భరోసా ఇచ్చారని రైతు సంఘం నేతలు తెలిపారు. రైతు స్వరాజ్య వేదిక సభ్యుడు కొండల్‌రెడ్డితో పాటు కిరణ్‌కుమార్, శ్రీహర్ష, పి.శంకర్, వెంకట్ రాములు, నాగయ్య, స్కైలాబ్ తదితర రైతు నేతలు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

## మతోన్మాదులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి

* **సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎర్ర అశోక్**




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : మతోన్మాదులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎర్ర అశోక్ అన్నారు. సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో గెజిటెడ్ హెడ్మాస్టర్ రాములు పై మతోన్మాదుల దాడికి నిరసన సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో సూరారం డివిజన్ షాపూర్ నగర్ లో గెజిటెడ్ హెడ్మాస్టర్ రాములు పై మతోన్మాదుల దాడిని ఖండిస్తూ నిరసన కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎర్ర అశోక్, కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి ఈ దేవదానం పాల్గొని మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగుడా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెడ్మాస్టర్ కంబలపల్లి రాములు డ్యూటీలో ఉన్నప్పుడు తొమ్మిదవ తరగతి చదువుతున్న అయ్యప్ప మాల లో ఉన్న అబ్బాయికి సార్ కాలు తగిలించాడని హెడ్మాస్టర్ పై మతోన్మాదులు భౌతిక దాడి చేసి,మాలలో ఉన్న 9వ తరగతి విద్యార్థి కాళ్ళు మొక్కించడం చూస్తే సమాజము తలదించుకునే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయన్నారు. దైవం కంటే గురువు గొప్పవాడనే మన సంస్కృతి ఎటు పోతుందో గమనించాలన్నారు. మతం ముసుగులో ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చూడాలన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు కీలుకాని లక్ష్మణ్, కే శీను , డి, కరుణాకర్, బి, నర్సింహులు, కే, బీరయ్య, గోపాల్, మధు, షఫీ, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ నూతన సీఎస్‌గా విజయానంద్

మరావతి: రాష్ట్రప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా కె.విజయానంద్ నియమితులయ్యారు. 1992 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన్ను సీఎస్‌గా నియమిస్తూ ఆదివారం రాత్రి ప్రభుత్వ ఉత్తర్వులు విడుదలయ్యాయి. విజయానంద్ ప్రస్తుతం ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ మంగళవారం పదవీవిరమణ చేయనున్నారు. ఆ స్థానంలో కొత్త సీఎస్‌గా విజయానంద్ బాధ్యతలు చేపడతారు. వైఎస్సార్ జిల్లా రాజుపాలెం మండలం అయ్యవారిపల్లె ఆయన స్వస్థలం. ఆదిలాబాద్ జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ నిర్వహించారు. అనంతరం రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, శ్రీకాకుళం, నల్గొండ జిల్లాల కలెక్టర్‌గా పనిచేశారు ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కో ఎండీగా సుదీర్ఘకాలం పాటు కొనసాగారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ)గానూ పనిచేశారు. 2025 నవంబరులో విజయానంద్ పదవీ విరమణ చేయనున్నారు.

## రీయింబర్స్‌మెంట్ బకాయిలు సంక్రాంతిలోపు చెల్లించాలి

* **తెలంగాణకు ఆర్ఆర్ఆర్ ఇచ్చిన కేంద్రానికి ధన్యవాదాలు: బండి సంజయ్**

తెలంగాణచౌక్(కరీంనగర్), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం రూ.7 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వాయిదాలుగా చెల్లిస్తామంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని, సంక్రాంతిలోపు మొత్తం చెల్లించాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ స్పష్టంచేశారు. కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో నిర్వహించిన దీన్‌దయాళ్ కోచింగ్ సెంటర్‌లో చదువుకొని ఉద్యోగాలు సాధించిన పలువురిని ఆయన ఆదివారం సన్మానించి అభినందించారు. అనంతరం సంజయ్ మాట్లాడుతూ... ''ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుంటే కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సారథ్యంలో కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులతో కలిసి సంక్రాంతి తర్వాత ఉద్యమం చేస్తాం. బిశ్వాల్ కమిటీ ప్రకారం రాష్ట్రంలో 2లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు భారాస, కాంగ్రెస్‌లు గతంలో చెప్పాయి. ఖాళీలన్నీ ఏడాదిలోపు భర్తీ చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్... 50 వేల పోస్టులు భర్తీ చేసినట్లు గొప్పలు చెబుతోంది. నిరుద్యోగులకు రూ.4 వేల భృతి ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ మాట తప్పింది. మోదీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రోజ్‌గార్ మేళాల ద్వారా ఇప్పటివరకు 9.25 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసింది. హైదరాబాద్ చుట్టూ ఆర్ఆర్ఆర్ నిర్మాణ టెండర్లను ఆహ్వానించిన కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు. రాష్ట్ర ప్రజలకు కేంద్రం ఇచ్చిన సంక్రాంతి కానుక ఇది. రహదారి నిర్మాణ వ్యయాన్ని పూర్తిగా కేంద్రమే భరించేందుకు సిద్ధమైంది.

# నితీశ్ రెడ్డికి పవన్ కల్యాణ్ ట్వీట్

- భారత్ గర్వించేలా చేశారు
- మీ ప్రతిభతో మరిన్ని మంచి ప్రదర్శనలు చేయండి
- ప్రియమైన నితీశ్ కుమార్ రెడ్డి అంటూ

**ఏపీ బ్యూరో:** తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డిపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆసక్తికర ట్వీట్ చేశారు. 'మీరు 'భారత్'లోని ఏ ప్రాంతం నుంచి వచ్చారన్నది కాదు. దేశం గర్వించేలా ఏం చేశారన్నది ముఖ్యం. ప్రియమైన 'నితీష్ కుమార్ రెడ్డి,' ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సెంచరీ సాధించిన భారత్ నుంచి అతి పిన్న వయస్కుడైన క్రికెటర్‌గా చరిత్ర సృష్టించినందుకు.. ఐకానిక్ మెల్‌బోర్న్ క్రికెట్ స్టేడియంలో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ కీలకమైన నాలుగోవ టెస్ట్ మ్యాచ్‌లో 114 పరుగులతో అద్భుతమైన నాక్‌తో మీ ప్రతిభను ప్రదర్శించారని పవన్ కల్యాణ్ తెలిపారు. 'మరెన్నో ప్రపంచ స్థాయి రికార్డులను సాధించడం కొనసాగించండి, భారత్ జెండాను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లండి. యువతకు క్రీడల పట్ల అభిరుచి దృఢ సంకల్పంతో ఆసక్తిని పెంపొందించేలా



స్ఫూర్తినివ్వండి. ఈ సిరీస్‌లో భారత్ ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.' డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# విద్యుత్ ఛార్జీలపై అబద్ధపు ప్రచారం చేస్తారా

- వైసీపీ నిరసన తెలపడం దారుణం
- ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

**తెలంగాణ బ్యూరో:** విద్యుత్ ఛార్జీలు పెంచారని అబద్ధపు ప్రచారంతో వైసీపీ రోడ్లెక్కడం దురదృష్టకరమని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచిందనే అసత్య ప్రచారాలు జగన్ మానుకోవాలని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచిందని వైసీపీ చేస్తున్న ధర్నాలపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే పితాని స్పందించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ, జనసేన పార్టీల్లో చేరడాన్ని జగన్ తట్టుకోలేకపోతున్నారు. వైసీపీ హయాంలో విద్యుత్ ఛార్జీలను ఎనిమిది సార్లు పెంచారు. యూనిట్ ఛార్జీలను పలు దఫాలుగా పెంచిన ఘనత జగన్‌ది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అదే ఛార్జీలను అమలు చేస్తున్నా.. విద్యుత్ ఛార్జీలు పెంచారని వైసీపీ ధర్నాలు చేస్తోంది. అబద్ధాల మహారాజు జగన్. వైసీపీ అధికారంలోకి రాగానే డబ్బులు కోసం పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ చేసుకున్నాడు. గత ఐదేళ్లలో విద్యుత్ సంస్థలపై పెరిగిన అప్పులు, ఛార్జీలపై రూ.81,768 కోట్లు ప్రజలపై భారం పడింది. విద్యుత్ ఛార్జీలు పెంచారని వైసీపీ



ధర్నాలు, నిరసనలు చేస్తే ప్రజలు నమ్ముతారా? అని పితాని సత్యనారాయణ ప్రశ్నించారు.

# తెలుగు సినిమాకు ఏఎన్నార్ కృషి మరువలేనిది

- మన్ కీ బాత్ లో ప్రధాని మోదీ
- రాజ్ కపూర్ సున్నితమైన అంశాలను ప్రపంచానికి పరిచయం చేశారు
- 75 ఏళ్ల రాజ్యాంగ సంబరాల్లో ప్రత్యేక వెబ్ సైట్
- అందరూ అభిప్రాయాలు పంచుకోవాలి

**నేషనల్‌బ్యూరో:** ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే 'మన్‌కీ బాత్' కార్యక్రమం 117వ ఎపిసోడ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పలు విషయాలు పంచుకున్నారు. అక్కినేని నాగేశ్వరరావు తెలుగు సినిమాకు చేసిన కృషిని కొనియాడారు. తెలుగు సినిమాను ఆయన మరో స్థాయికి తీసుకువెళ్లారని ప్రశంసించారు. నాగేశ్వరరావు సినిమాల్లో భారతీయ సంప్రదాయాలు, విలువలను చాలా చక్కగా చూపించేవారని గుర్తు చేసుకున్నారు. బాలీవుడ్ దర్శకుడు తపన్ సిన్హా సినిమాలు సమాజానికి కొత్త బాటలు వేశాయని పేర్కొన్నారు. రాజ్ కపూర్ తన సినిమాల ద్వారా భారతదేశంలోని సున్నితమైన అంశాలను ప్రపంచానికి పరిచయం చేశారన్నారు. భారతీయ చలనచిత్ర రంగం వైపు ప్రపంచ దేశాలు చూస్తున్నాయని ప్రధాని అన్నారు.



**రాజ్యాంగ విలువల గురించి మాట్లాడుతూ.. రాజ్యాంగం భారతీయులందరికీ ఓ మార్గనిర్దేశకం అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఓ ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ పవిత్ర గ్రంథంపై ప్రజలు తమ అభిప్రాయాలను వీడియోలుగా రూపొందించి.. ఈ వెబ్‌సైట్‌లో పంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ 75 ఏళ్ల సంబరాల్లో ప్రజలను భాగం చేయాలనే ఉద్దేశంతో దీనిని రూపొందించామన్నారు. అంతే కాకుండా ఈ వెబ్‌సైట్లో అనేక భారతీయ భాషల్లో రాజ్యాంగాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని.. అన్ని భాషల వారు రాజ్యాంగ పీఠికను.. అనేక విషయాలను చదివి.. అర్థం**

తొలిసారిగా వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్‌ను వచ్చే ఏడాది మన దేశంలో నిర్వహించబోతున్నామని ప్రధాని చెప్పారు. ఈ సమ్మిట్‌లో మీడియా, వినోద పరిశ్రమకు చెందిన ప్రపంచ దేశాల లు పాల్గొంటారని తెలిపారు.

## మాది భయపడే రక్తం కాదు..

# భయపెట్టే రక్తం

- ఎమ్మెల్సీ కవిత
- కేసీఆర్‌ను ఎదుర్కొనే దమ్ము లేకే నాపై కేసులు
- అరెస్టు తర్వాత నిజామాబాద్ లోమొదటి సారి పర్యటన
- బస్సుల సంఖ్య తగ్గించి ఫ్రీ ఇస్తున్నట్లు ప్రచారం
- నేనుదేనికి భయపడను



**తెలంగాణ బ్యూరో :** కేసీఆర్‌ను ఎదుర్కొనే ధైర్యం, దమ్ములేక నాపై, కేటీఆర్ పై అక్రమ కేసులు పెట్టారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్ పర్యటనలో భాగంగా కవిత మాట్లాడుతూ.. ఎన్ని కేసులు పెట్టిన భయ పడేది లేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులను మోసం చేసిందన్నారు. బస్సుల సంఖ్య తగ్గించి ఫ్రీ బస్సు ఇస్తున్నారని తెలిపారు. అనేక ఇబ్బందులు, కష్టాలు ఎదురైనా పిడికిలి ఎత్తి అన్ని ఎదురించి వచ్చానని కవిత అన్నారు. నేను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డను... దేనికీ భయపడనని అన్నారు. మాది భయపడే రక్తం కాదు.. భయపెట్టే రక్తం అన్నారు. మేము తప్పు చేయలేదు... భయపడే ప్రసక్తే లేదన్నారు. ఇచ్చిన ఒక్క హామీని కూడా కాంగ్రెస్ సర్కార్ అమలు చేయలేదని మండిపడ్డారు. బీరాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం .... ఇప్పటి వరకు పెన్షన్లు మొత్తాన్ని పెంచలేదన్నారు. మనం ఊరుకుంటే ప్రభుత్వం కదలదు ప్రతీ ఒక్కరు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలన్నారు. గ్రామ గ్రామాన కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపు నిచ్చారు. పీపుల్స్ ఫ్రెండ్లీ పోలిసింగ్ పోయి... రాష్ట్రంలో కాంగ్రెస్ ఫ్రెండ్లీ పోలీసింగ్ నడుస్తోందన్నారు. రాష్ట్రంలో పోలీసు జులుం నడుస్తుందన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన మంచి పనులను ప్రభుత్వం కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాబోయేది గులాబీ జెండా శకమే... అందులో సందేహమే లేదన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జె

# చట్టాన్ని అతిక్రమిస్తే రౌడీ షీట్లు ఓపెన్ చేస్తాం

**మేడిపల్లి ఎస్.ఐ శ్యామ్ రాజ్**

**మేడిపల్లి :** రాబోయే నూతన సంవత్సర వేడుకలను ప్రతి ఒక్కరూ సంబరంగా జరుపుకోవాలని మేడిపల్లి ఎస్.ఐ శ్యామ్ రాజ్ అన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా డిసెంబర్ 31న నూతన సంవత్సర వేడుకల్ని జరుపుకునే వాళ్లు చట్టాన్ని అతిక్రమిస్తే వారిపై రౌడీ షిట్‌లు ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. రోడ్లపైన కేకులు కట్ చేయడం, బాణాసంచాలు పేల్చడం వంటి చర్యలు చట్టరీత్య నేరమని చెప్పారు. ఒక్కసారి రౌడీ షీటర్లుగా కేసులు నమోదైతే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. మద్యం సేవించి వాహనం నడిపి అపాయాన్ని కొని తెచ్చుకోవద్దని, మిమ్మల్ని నమ్ముకున్న, మీ మీద ఆధార పడ్డ వారి జీవితాలను దుర్భరం చెయ్యొద్దని, ప్రతి ఒక్కరూ నూతన సంవత్సరాన్ని




కుటుంబ సమేతంగా జరుపుకోవాలని ఎస్ఐ శ్యామ్ రాజ్ సూచించారు.

# నర్సంపేటలో పులి సంచారం

- నిర్ధారించిన అటవీశాఖ అధికారులు
- భయబ్రాంతులకు గురవుతున్న ప్రజలు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- నర్సంపేట సీఐ రమణమూర్తి

**నర్సంపేట:**

నల్లబెల్లి మండలంలోని పలు గ్రామాల్లోని పంట పొలాల్లో పులి అడుగు ముద్రలు లభ్యమయ్యాయి. మూడు రోజులుగా పులి ఆ ప్రాంతంలో సంచరిస్తోంది. తాజాగా నర్సంపేట మండలంలో అధికారులు పులి ఆనవాళ్లను గుర్తించడం చర్చనీయాంశంగా మారింది. నర్సంపేట సీఐ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం ఉదయం నర్సంపేట మండలంలో రాజుపేట శివారు జంగాలపల్లి తండా సమీపంలోని పంట పొలాల్లో పులి అడుగులు ఉన్నట్లు గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు.సంఘటనా స్థలికి చేరుకున్న అటవీశాఖ అధికారులు అవి పులి అడుగు ముద్రలే అని నిర్ధారించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మండలంలో పులి సంచరిస్తుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు పోలీసులు సూచించారు. పొలం పనులకు వెళ్లిన వారంతా కూడా సాయంత్రం 4 గంటలలోపు ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. ఒంటరిగా పొలాలకు వెళ్లకుండా సమూహంగా వెళ్లాలన్నారు. పశువులు, మేకల కాపలాదారులు అప్రమత్తంగా ఉండాలని నర్సంపేట సీఐ ర



# నుమాయిష్ ప్రారంభం వాయిదా

- జనవరి 1న ప్రారంభం కావాల్సింది జనవరి 3కు వాయిదా
- 2500 నిర్వాహకుల నుంచి దరఖాస్తుల స్వీకరణ



**తెలంగాణ బ్యూరో :** హైదరాబాద్‌లో బుధవారం (జనవరి 1న ) ప్రారంభం కావాల్సిన అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన ( నుమాయిష్) వాయిదా పడింది. మాజీ ప్రధాని సంతాప దినాల నేపథ్యంలో నుమాయిష్ రెండు రోజుల పాటు వాయిదా పడింది. జనవరి 3వ తేదీన నుమాయిష్ ప్రారంభం కానుంది.హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రతి ఏడాది నుమాయిష్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం జనవరి 1వ తేదీన ఈ నుమాయిష్ ప్రారంభమై.. 46 రోజుల పాటు అంటే ఫిబ్రవరి 15వ తేదీ వరకు జరగాల్సి ఉంది. పారిశ్రామిక ప్రదర్శనకు గాను దాదాపు 2500 స్టాళ్ల నిర్మాణం చేసేందుకు గాను నిర్వాహకుల నుంచి దరఖాస్తులను స్వీకరించడంతో పాటు స్టాళ్ల కేటాయింపు చివరి దశకు చేరుకుంది. ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు, మంత్రి శ్రీధర్ బాబు పర్యవేక్షణలో ఉపాధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి సురేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి మోహన్, కోశాధికారి డాక్టర్ ప్రభాశంకర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఎగ్జిబిషన్‌కు జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి లభించగా ప్రతి సంవత్సరం దాదాపు 25 లక్షల మంది సందర్శకులు ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తారు. పలు పారిశ్రామిక ఉత్పత్తులతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల స్టాళ్లు, ఫుడ్ కోర్టులు, సందర్శకులను అలరించేందుకు గాను అమ్యూజ్‌మెంట్ పార్క్ ఇలా అనేక స్టాళ్లు ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉంటాయి.

# డ్రగ్స్ లేని తెలంగాణే లక్ష్యం

- తెలంగాణ డీజీపీ జితేందర్
- నేర వార్షిక నివేదికను విడుదల చేసిన డీజీపీ
- డిజిటల్ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తొలిరాష్ట్రం తెలంగాణ
- ఈ ఏడాదిలో 33,618 సైబర్ కేసులు నమోదు
- 142.95 కోట్ల డ్రగ్స్ పట్టుకున్నాం

**తెలంగాణ బ్యూరో :** తెలంగాణ రాష్ట్రంలో 2024 సంవత్సరంలో కేసుల నమోదు పెరిగిందని తెలంగాణ డీజీపీ జితేందర్ అన్నారు. హైదరాబాద్‌లో నేర వార్షిక నివేదికను విడుదల చేసి మీడియాకు వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది 2 లక్షలకు పైగా కేసులు నమోదు అయ్యాయన్నారు. డ్రగ్స్ లేని తెలంగాణ సాధనే పోలీసు శాఖ లక్ష్యమని చెప్పారు. మోసాలకు పాల్పడుతున్న 1800 వెబ్‌సైట్ యూఆర్‌ఎల్‌లను బ్లాక్ చేసినట్లు తెలిపారు. కొత్త నేర చట్టాల అమలు కోసం పోలీసులకు శిక్షణ ఇచ్చామని, డిజిటల్ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని పేర్కొన్నారు. ఈ ఏడాది 33,618 సైబర్ క్రైమ్ కేసులను నమోదు చేశామన్నారు. 1525 కిడ్నాప్, 703 చోరీ, 58 దోపిడీ, 856 హత్య, 2945 అత్యాచారాల కేసులు నమోదు చేశామన్నారు. డయల్ 100కు 16,92,173 ఫిర్యాదులు వచ్చాయి. కొత్త చట్టం వచ్చిన తర్వాత 85,190 కేసులను నమోదు చేశాం. కొత్త చట్టం ప్రకారం సైబరాబాద్ పరిధిలో 15,360, హైదరాబాద్‌లో 10,501, రాచకొండలో 10,251 కేసులను నమోదు చేశాం. సైబర్ క్రైమ్ కేసుల్లో రూ.180 కోట్లను తిరిగి బాధితులకు అప్పగించాం. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 142.95 కోట్లు మాదకద్రవ్యాలను సీజ్ చేశాం. డ్రగ్స్ కేసుల్లో 4,682 మంది నిందితులను అరెస్టు చేశాం.

**పోలీసు శాఖలో ఎలాంటి సమస్యలు లేవు**

పోలీసు శాఖ పరంగా ఎలాంటి సమస్యలు లేవు. చాలా చోట్ల వ్యక్తిగత కారణలతోనే ఆత్మహత్యలు జరుగుతున్నాయి. సంధ్య థియేటర్ ఘటన కేసులో దర్యాప్తు సాగుతోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ కొనసాగుతోంది. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి సీబీఐకి లేఖ రాశాం. నిందితులను విదేశాల నుంచి భారత్‌కు రప్పించాలంటే ఇంటర్నేషనల్ ప్రాసెస్ జరుగుతుంది. ఇందుకు ఇంటర్‌పోల్ సహాయం తీసుకుంటున్నాం. కేసులో ప్రధాన నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావును హైదరాబాద్‌కు తీసుకురావడానికి సమయం పడుతుందని డీజీపీ జితేందర్ చెప్పారు.



# తిరుమలలో అందరిని సమానంగా చూడాలి


- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్
- గద్వాల నియోజకవర్గంలో జములమ్మ అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి
- తెలంగాణ, ఆంధ్రకు ఏకైక అనుబంధం శ్రీవారు

**తెలంగాణ బ్యూరో:**

తిరుమలలో శ్రీవారి దర్శనానికి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను అనుమతించకపోవడంపై మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మరోసారి అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆలయాల్లో అందర్నీ సమానంగా చూస్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. తిరుమలలోనూ అందర్నీ సమానంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. గద్వాల నియోజకవర్గంలోని జములమ్మ అమ్మవారిని ఆదివారం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. అనంతరం గద్వాల బీఆర్ఎస్ నాయకుడు బాసు హనుమంత నాయుడు నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు ఆంధ్రా ప్రాంతంతో ఉన్న ఏకైక సంబంధం తిరుపతి అని తెలిపారు. తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డ కూడా తిరుమల శ్రీవారిని దర్శించుకుని తలనీలాలు సమర్పించుకోవాలని అనుకుంటారని పేర్కొన్నారు. తిరుమల బ్రహ్మోత్సవాలకు గద్వాలలో నేసిన పట్టుచీరను సమర్పించడం ఆనవాయితీగా వస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కూడా హైదరాబాద్‌లోనే ఉంటారని తెలిపారు. ఇప్పటివరకు తెలంగాణ, ఏపీ అనే తేడా లేకుండా తిరుమలలో శ్రీవారి దర్శనాలు కల్పించారని శ్రీనివాస్ గౌడ్. కానీ ఇప్పుడు తెలంగాణ భక్తులు, రాజకీయ నాయకులపై వివక్ష చూపిస్తున్నారని ఆరోపించారు. సడెన్‌గా సిఫారసు లేఖలు ఆపితే భేదాభిప్రాయాలు వస్తాయని పేర్కొన్నారు. తక్షణమే తెలంగాణ ప్రజా ప్రతినిధుల



సిఫారసు లేఖలను అనుమతించాలని టీటీడీని కోరారు. దేవుడి దగ్గర అంతా సమానమేనని.. దీంట్లో రాజకీయం ఏమీ లేదని ఆయన స్పష్టం చేశారు.



ఇంట్లోనే ప్రొటీన్ పౌడర్

# ఇలా తయారు చేసుకోండి..!

ప్రొటీన్ పౌడర్ అనేది కండరాల నిర్మాణానికి, బరువు తగ్గడానికి, శక్తి స్థాయిలను పెంచడానికి ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే, మార్కెట్‌లో లభించే ప్రొటీన్ పౌడర్‌ల ఖరీదు ఎక్కువ. అంతే కాకుండా వాటిలో ప్రిజర్వేటివ్‌లు, కృత్రిమ రుచులు, చక్కెర వంటి పదార్థాలను కలిపి ఉండొచ్చు. ఇవేమీ లేకుండా ఇంట్లోనే స్వచ్ఛమైన, సరసమైన ప్రొటీన్ పౌడర్ తయారు చేసుకోవడం మంచిది. ఇంట్లో తయారు చేసిన ప్రొటీన్ పౌడర్‌లో రుచి, అవసరాలకు అనుగుణంగా పదార్థాలను కలపొచ్చు. ఇది పూర్తిగా సురక్షితమైనది. ఇందులో పోషకాహారం కూడా సమృద్ధిగా ఉంటుంది. దీన్ని ఇంట్లోనే తయారు చేసుకునే విధానాన్ని తెలుసుకుందాం..

మీకు కావాల్సిన పదార్థాలు -నో ఫ్యాట్ మిల్క్ పౌడర్ – 3 కప్పులు, డ్రై ఓట్స్ – 1 కప్పు, బాదం పప్పు – 1 కప్పు, కొద్దిగా బెల్లం లేదా పంచదార కానీ కావాలనుకుంటే. ఒక పావు కప్పు కోకోవా పౌడర్ కూడా కలుపుకోవచ్చు మీ ఇష్టాన్ని బట్టి. వీటన్నింటినీ కలిపి మిక్సీలో పొడి చేసి గాలి చొరని డబ్బాలో పెట్టుకోండి. ఎక్కువ క్వాంటిటీలో చేసుకుంటే ఫ్రిజ్‌లో దాచుకోవచ్చు. ఇది ప్రతి రోజూ వాడితే ఎంతో మంచిది. ఒక అర కప్పు ప్రొటీన్ పౌడర్ లో 180 క్యాలరీలూ, 12 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. ఈ పౌడర్ ని పాలలో కలిపి తాగచ్చు, లేదా స్మూతీల్లో, షేక్స్ లో కలిపి కూడా తీసుకోవచ్చు.

ఇది కాకుండా మరో పద్ధతితో కూడా దీన్ని తయారు చేసుకోవచ్చు. కావాల్సిన పదార్థాలు: బాదం పప్పూ, పిస్తా పప్పు, వాల్నట్స్, వేరుశెనగపప్పూ, సోయా బీన్స్, గుమ్మడి గింజలూ, ఫ్లాక్స్ సీడ్స్, చియా సీడ్స్, ఓట్స్, పాల పొడి.. అన్నీ పావు కప్పు చొప్పున తీసుకోండి. పాల పొడి తప్ప మిగిలిన వాటిని ఒక్కొక్కటిగా డ్రై రోస్ట్ చేసుకోండి. అన్నీ కలిపి రోస్ట్ చేస్తే కొన్ని మాడిపోయే ప్రమాదం ఉంది. కొన్ని వేగకపోవచ్చు. ఇవి చల్లారిన తరువాత మిల్క్ పౌడర్ తో కలిపి మిక్సీ లో పొడి చేసుకోండి. ఆ పొడిని జల్లిస్తే మెత్తని పౌడర్ తయారౌతుంది. ఇందులో మీకు కావాలనుకుంటే పావు కప్పు కోకోవా పౌడర్ కూడా కలుపుకోవచ్చు. జల్లెడ లో మిగిలిన దాన్ని పారెయ్యక్కరలేదు. ఏ పాయసం లోనో, హల్వా లోనో కలిపేయొచ్చు. దీన్ని కూడా పాలలో, స్మూతీల్లో, షేక్స్ లో కలిపి తాగచ్చు. ఒక స్కూప్ పౌడర్ లో సుమారుగా పదకొండు గ్రాముల ప్రొటీన్, 45 క్యాలరీలు ఉంటాయి.



పిల్లలను పెంచడంలో

# ఆ జాగ్రత్తలు పాటించండి



పిల్లల్ని పెంచడం ప్రతి పేరెంట్స్ జీవితంలో ఎంతో ఆనందమయమైన అనుభవం. అయితే, పిల్లల పుట్టిన తరువాత వారి పెంపకం ఒక పెద్ద బాధ్యతగా మారుతుంది. ఇది చాలామంది తల్లిదండ్రులకు కాస్త కష్టసాధ్యమైంది నిపించవచ్చు. అయితే, మీరు పాజిటివ్ పేరెంటింగ్ చేయడం వల్ల మీ పిల్లల అభివృద్ధి, ఆరోగ్యం, భవిష్యత్తు కోసం ఎంతో ఉపయోగపడుతుంది. పాజిటివ్ పేరెంటింగ్ అనేది పిల్లలతో ప్రేమ, సహకారం, క్రమశిక్షణ మిళితమైన దృష్టితో వ్యవహరించడమే. ఇది పిల్లల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, వారిని పూర్తి స్వతంత్రంగా, మానసికంగా శక్తివంతంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది.

### మంచి, చెడుల గురించి వివరించండి

పిల్లలకు ఏదైనా కొత్త విషయాలు చెప్పేటప్పుడు మంచి, చెడుల గురించి వివరించడం చాలా అవసరం. ఇది వారికి సమాజం గురించి అవగాహన పెంచి, సరైన నిర్ణయాలు తీసుకునే గుణాన్ని కల్పిస్తుంది.

### పిల్లలకు స్వతంత్రత ఇవ్వండి

వయసుకు తగ్గట్టుగా పిల్లలకు స్వతంత్రతను ఇవ్వడం ద్వారా వారు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవడం, బాధ్యతలను అర్థం చేసుకోవడం సాధ్యమవుతుంది. తల్లిదండ్రులు వారితో ఎక్కువ సమయం గడిపి మంచి, చెడుల గురించి వివరిస్తే పిల్లల భవిష్యత్తు మరింత మెరుగ్గా ఉంటుంది.



### పిల్లల్ని ప్రోత్సహించండి

మీ పిల్లలని ప్రోత్సహించడం పాజిటివ్ పేరెంటింగ్‌లో కీలక పాత్ర పోషిస్తుంది. పిల్లలు ఏ పని సరైన విధంగా చేసేటప్పుడు వారిని మెచ్చుకోవడం, చిన్న గిఫ్ట్‌లు ఇవ్వడం ద్వారా వారిలో విశ్వాసం పెరుగుతుంది. ఇది వారిని మరింత కష్టపడి పని చేయడానికి ప్రేరేపిస్తుంది.



### పిల్లలతో సమయం గడపండి

ఈ వేగవంతమైన జీవితంలో పని, ఇళ్ల పనుల్లో నిమగ్నమై పిల్లలతో సరైన సమయం గడపలేకపోవడం సాధారణమైంది. కానీ, ఇది పిల్లల పెంపకంపై ప్రతికూల ప్రభావాన్ని చూపవచ్చు. వారితో ప్రతిరోజూ లేదా వారంలో కనీసం ఒక రోజు సమయం కేటాయించండి. వారికి ఇష్టమైన చోటు తీసుకెళ్లడం, సినిమాలు చూడడం లేదా పార్క్‌కు తీసుకెళ్లడం ద్వారా మీరు వారితో మంచి అనుబంధాన్ని ఏర్పరచవచ్చు.



న్యూ ఇయర్ వచ్చేస్తోంది

# వైట్ ఫారెస్ట్ కేక్ ఇంట్లోనే తయారు చేసుకోండిలా..!



మరికొన్ని గంటల్లో ప్రపంచవ్యాప్తంగా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ మొదలవనున్నాయి. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ ఒక్కో దేశంలో ఒక్కోలా జరుగుతుంటాయి. మనదేశంలో చాలామంది డిసెంబర్ 31 అర్ధరాత్రి 11:59 దాటగానే కేకు కట్ చేసి కొత్త ఏడాదికి స్వాగతం పలుకుంటారు. తర్వాత ఈ కేకు ముక్కలను తింటూ కూల్ డ్రింక్స్ తాగుతూ ఎంజాయ్ చేస్తారు. అయితే న్యూ ఇయర్ కేకు కోసం మీరు బేకరీకి వెళ్లి వందల రూపాయలు పెట్టి కొనక్కర్లేదు. న్యూ ఇయర్ పార్టీ కోసం బేకరీకి వెళ్లకుండా ఇంట్లోనే ఈజీగా కేకుని తయారు చేసుకోవచ్చు. ఎక్కువమంది ఇష్టపడే వైట్ ఫారెస్ట్ కేకుని ఎలా తయారు చేసుకోవాలి.దీని తయారీకి కావాల్సిన పదార్థాలు ఏంటో ఇక్కడ చూడండి.

**న్యూ ఇయర్ స్పెషల్ వైట్ ఫారెస్ట్ కేకు తయారీకి కావాల్సిన పదార్థాలు**

- -బటర్
- -మైదా పిండి
- -మిల్క్ పౌడర్
- -బేకింగ్ సోడా
- -బేకింగ్ పౌడర్
- -వెనిగర్
- -వెన్నిలా ఎసెన్స్
- -షుగర్ పౌడర్
- -కాచి చల్లార్చిన పాలు
- -వెన్న
- -విప్పింగ్ క్రీమ్ పౌడర్
- -ఐస్ క్యూబ్స్
- -షుగర్ సిరప్
- -బటర్ పేపర్

వైట్ ఫారెస్ట్ కేకు తయారీ విధానం

కేకు టిన్ను తీసుకొని దానిలో బటర్ లేదా ఆయిల్ ని అప్లై చేసి దానిపై కొద్దిగా మైదాపిండి చల్లుకోవచ్చు లేదా మీ దగ్గర బటర్ పేపర్ ఉంటే దాన్ని వేసి దానిపై కూడా కొంచెం బటర్ అప్లై చేసి పక్కనపెట్టుకోండి. ఇప్పుడు ఓ గిన్నె తీసుకొని దానిమీద జల్లెడ పెట్టి అందులో 1కప్పు మైదాపిండి,పావు కప్పు మిల్క్ పౌడర్,అర టీ స్పూన్ బేకింగ్ సోడా,1 టీస్పూన్ బేకింగ్ పౌడర్,1టీస్పూన్ వెనిగర్ వేసి వీటన్నింటిని బాగా జల్లించుకోండి. తర్వాత అన్నీ కలిసేటట్లు కలిపి గిన్నెను పక్కనపెట్టుకోండి. ఇప్పుడు మరో బౌల్ తీసుకొని అందులో పావు కప్పు కరిగించిన వెన్న,అర కప్పు షుగర్ పౌడర్,ముప్పావు కప్పు కాచి చల్లార్చిన పాలు,1 టీస్పూన్ వెన్నిలా ఎసెన్స్ కూడా వేసి మొత్తం బాగా కలిసేట్లు కలుపుకోండి. బౌల్ లోని షుగర్ పౌడర్ పూర్తిగా కరిగిపోయేంతవరకు కలుపుకోవాలి. తర్వాత ఇందులో ముందుగా కలిపి పక్కన పెట్టుకున్న మైదా మిశ్రమాన్ని కొంచెం కొంచెంగా పోస్తూ బాగా కలిపిన తర్వాత ఈ మొత్తాన్ని బటర్ అప్లై చేసి పక్కన ఉంచిన కేకు టిన్నులో పోసేయండి. తర్వాత స్టవ్ ఆన్ చేసి ఓ పాన్ పెట్టి అందులో ఓ స్టాండ్ పెట్టి 10నిమిషాలు హీట్ చేసిన తర్వాత అందులో ఈ కేకు టిన్నుని పెట్టి మూతపెట్టేసి 30 నిమిషాల పాటు బేక్ చేయండి. 30 నిమిషాల తర్వాత మూత తీసి చెక్ చేయండి. ఓ టూత్ పిక్ తీసుకొని గుచ్చి చూడండి. టూత్ పిక్ కి ఏ మాత్రం పిండిలా అంటుకోకుంటే కేకు బాగా బేక్ అయినట్లేనని భావించవచ్చు. వెంటనే ఈ కేకు టిన్నుని బయటకు తీసి దానిమీద ఓ గుడ్డ కప్పి కేకుని పూర్తిగా చల్లారనివ్వండి.

ఇప్పుడు వైట్ చాక్లెట్ ని తీసుకొని చాకుతో తురుముకోండి. ఈ వైట్ చాక్లెట్ బేకరీలు లేదా అమెజాన్ వంటి ఆన్ లైన్ సైట్లలో అందుబాటులో ఉంటుంది. తర్వాత వెడల్పుగా ఉన్న ఓ గిన్నె తీసుకొని అందులో 1కప్పు విప్పింగ్ క్రీమ్ పౌడర్,అర కప్పు కాచి చల్లార్చిన పాలు పోసి బాగా కలపి ఈ బౌల్ ని డీప్ ఫ్రిడ్జ్ లో పెట్టేయండి. 10 నిమిషాల తర్వాత వెడల్పుగా ఉన్న ఓ గిన్నె తీసుకొని అందులో కొన్ని ఐస్ క్యూబ్స్ వేసి వాటి మీద డీప్ ఫ్రిడ్జ్ లో నుంచి గిన్నె తీసి పెట్టి 34 నిమిషాలు కంటిన్యూగా బ్లెండ్ చేయండి. క్రీము కాస్త గట్టిపడిన తర్వాత అందులో 2 టీస్పూన్ల షుగర్ పౌడర్ వేసి మళ్లీ 34 నిమిషాలు బాగా బ్లెండ్ చేస్తే కేకు క్రీమ్ రెడీ. దీన్ని అలాగే ఐస్ క్యూబ్స్ గిన్నెలోనే ఉంచి పక్కనపెట్టుకోండి.

ఇప్పుడు ఓ ప్లేట్ తీసుకొని దానిమీద కేకుని పెట్టి పైన ఉబ్బిన పార్ట్ మొత్తాన్ని చాకుతో కట్ చేయండి. తర్వాత ఒక లేయర్ గా లేదా రెండు లేయర్స్ గా కేకుని కట్ చేసుకోండి. తర్వాత కేకు పాడ్ తీసుకొని దాని మధ్యలో కొద్దిగా కేకు క్రీమ్ అప్లై చేసి దాని మీద ఒక లేయర్ కేకు పెట్టి దానిమీద షుగర్ సిరప్ వేసుకోండి. షుగర్ సిరప్ ని.. అరకప్పు వాటర్ లో 2 లేదా 3 టేబుల్ స్పూన్ల షుగర్ పౌడర్ వేసి కలిపితే రెడీ అయిపోతుంది.కేకు లేయర్ మీద సిరప్ వేసిన తర్వాత ముందుగా రెడీ చేసి పెట్టుకున్న క్రీమ్ ని అన్ని వైపులకి కలిసేటట్లుగా అప్లై చేశాక దానిమీద ముందుగా కట్ చేసి ఉంచిన చాక్లెట్ తురుము వేయండి. తర్వాత దానిమీద ఇంకో లేయర్ కేకు పెట్టి దానిమీద షుగర్ వేపి తర్వాత క్రీమ్ రాసి తర్వాత చాక్లెట్ తురుము కూడా వేయండి. దీని మీదనే మిగిలిన మరో లేయర్ కేకుని కూడా పెట్టి దానిమీద షుగర్ సిరప్ వేసిన తర్వాత క్రీముని కేకు మొత్తంలో ఎక్కడా ఖాళీ లేకుండా అప్లై చేసుకోండి. తర్వాత కేకు చుట్టూ కట్ చేసి ఉంచిన చాక్లెట్ తరుముని అద్దుకోండి. తర్వాత కేకు పై భాగంలో క్రీముతో మీకు నచ్చిన విధంగా డెకరేషన్ చేసుకోండి. పైన కొన్ని చెర్రీలను కూడా డెకరేట్ చేసుకోండి.

అంతే కేకు రెడీ.

# టాప్-10 సంస్థల్లో ఆరింటి ఎం-క్యాప్ రూ.86,848 కోట్ల వృద్ధి..

## రిలయన్స్, హెచ్డీఎఫ్‌సీ బ్యాంకులకు భారీ లబ్ధి..!




**న్యూఢిల్లీ:** గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత దేశీయ స్టాక్ మార్కెట్లలో టాప్-10 సంస్థల్లో ఆరు సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.86,847.88 కోట్లు పెరిగింది. హెచ్డీఎఫ్సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ భారీగా లబ్ధి పొందాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ -30 గతవారం 657.48 పాయింట్లు, ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ 225.9 పాయింట్ల లాభంతో ముగిశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్ టెల్, ఐటీసీ, హిందూస్థాన్ యూనీ లివర్ లాభ పడ్డాయి. మరోవైపు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ), భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) నష్టపోయాయి.

హెచ్డీఎఫ్సీ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.20,235.95 కోట్లు పుంజుకుని రూ.13,74,945.30 కోట్ల వద్ద స్థిర పడింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎం-క్యాప్ రూ.20,230.9 కోట్ల లాభంతో రూ.16,52,235.07 కోట్ల వద్ద ముగిసింది. ఐటీసీ ఎం-క్యాప్ రూ.17,933.49 కోట్ల లబ్ధితో రూ.5,99,185.81 కోట్ల వద్ద నిలిచింది. ఐసీఐసీఐ బ్యాంక్ ఎం-క్యాప్ రూ.15,254.01 కోట్ల లాభంతో రూ.9,22,703.05 కోట్ల వద్ద ముగిసింది. భారతీ ఎయిర్ టెల్ ఎం-క్యాప్ రూ.11,948.24 కోట్లు పెరిగి రూ.9,10,735.22 కోట్లకు చేరుకుంది. హిందూస్థాన్ యూనీ లివర్ ఎం-క్యాప్ రూ.1,245.29 కోట్లు పుంజుకుని రూ.5,49,863.10 కోట్లకు చేరుకుంది.

మరోవైపు, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.11,557.39 కోట్ల నష్టంతో రూ.7,13,567.99 కోట్లకు చేరుకుంది. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.8,412.24 కోట్లు కోల్పోయి రూ.5,61,406.80 కోట్ల వద్ద నిలిచింది. ఇన్ఫోసిస్ ఎం-క్యాప్ రూ.2,283.75 కోట్ల పతనంతో రూ.7,95,803.15 కోట్ల వద్ద ముగిసింది. టీసీఎస్ ఎం-క్యాప్ రూ.36.18 కోట్ల నష్టంతో రూ.15,08,000.79 కోట్ల వద్ద స్థిర పడింది. గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత టాప్-10 సంస్థల్లో రిలయన్స్ మొదటి స్థానంలో కొనసాగుతున్నది. తర్వాతీ స్థానాల్లో టీసీఎస్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్ టెల్, ఇన్ఫోసిస్, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ), ఐటీసీ, ఎల్ఐసీ, హిందూస్థాన్ యూనీ లివర్ నిలిచాయి.

# టెలికం సంస్థలకు ఇక్కట్లే..

## టారీఫ్‌ల పెంపుతో కొత్త ఏడాదిలో సవాళ్లే !

## శాట్కామ్ సర్వీసెస్‌తో ధరల యుద్ధానికి అవకాశం



**న్యూఢిల్లీ:** దేశీయ ప్రైవేట్ టెలికం సంస్థలకు కొత్త ఏడాదిలో ప్రధానంగా రెండు సవాళ్లు ఎదురుకావచ్చన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ ఏడాది ఆయా టెలికం కంపెనీలు టారీఫ్‌లను పెంచిన విషయం తెలిసిందే. అయితే ఇది రివర్స్ ఫైర్ అయిందన్న సంకేతాలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రధాన టెలికం సంస్థల నుంచి కస్టమర్లు ఇతర సంస్థల్లోకి మారిపోతున్నారు. దీంతో వచ్చే ఏడాదీ ఈ జంపింగ్‌లుంటాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నిజానికి ఇప్పటికే రిచార్జ్ ప్లాన్ల ధరలు ఠారెత్తిస్తున్నాయి. అయినప్పటికీ ఖర్చులు పెరిగాయన్న కారణాలతో టెలికం ఆపరేటర్లు ధరల భారాన్ని కస్టమర్లపై మోపుతూనే ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.


ఈ నేపథ్యంలో ఈ ఏడాది మధ్యలో ధరలు మరింత పెరగడంతో సబ్‌స్క్రైబర్ల సంఖ్య పెద్ద ఎత్తునే పడిపోయింది. రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాల్లో చార్జీలు 10 నుంచి 26 శాతం మేర పెరిగాయి. దీంతో ఆయా సంస్థలు 2.6 కోట్ల కస్టమర్లను కోల్పోయాయని అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. మరోవైపు దాదాపు 68 లక్షల కస్టమర్లు ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ కనెక్షన్‌ను తీసుకున్నట్టు తేలింది. ఇప్పటికీ బీఎస్ఎన్ఎల్ 3జీ సర్వీసులనే ఇస్తుండగా, 4జీ సేవల విస్తరణ పనుల్లో ఉండటం గమనార్హం. అయినప్పటికీ కొత్త కస్టమర్లు వస్తున్నారంటే ధరల భారం ఏ స్థాయిలో ప్రైవేట్ కంపెనీలకు ప్రతికూలంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

### శాట్కామ్‌ల ఎంట్రీతో..

వచ్చే ఏడాది శాటిలైట్ ఆధారిత సేవల సంస్థలతోనూ టెలికం కంపెనీలకు మార్కెట్‌లో భారీగానే పోటీ ఉండొచ్చన్న అంచనాలున్నాయి. ప్రధానంగా ఎలాన్ మస్క్ స్టార్‌లింక్ రాకతో ప్రస్తుతం టెలికం సంస్థలకు పెద్ద ఎత్తున ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న డాటా వ్యాపారానికి ఎదురుదెబ్బేనన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. శాట్కామ్ సర్వీసులతో ధరల యుద్ధానికి వీలుందని, డాటా ధరలు ఇంకా పడిపోవచ్చని చెప్తున్నారు. ఇదే గనుక జరిగితే ప్రైవేట్ రంగ టెలికం సంస్థలకు నష్టాలే. 5జీ సేవలను దేశవ్యాప్తంగా విస్తరిస్తూపోతున్న టెల్కోలు.. అందుకోసం రూ.70వేల కోట్లదాకా పెట్టుబడులు పెట్టాయి.

# ఉద్యోగ కల్పనలో దూసుకుపోతున్న ఎలక్ట్రానిక్స్..

## వచ్చే మూడేండ్లలో కోటి ఉద్యోగాలు



**న్యూఢిల్లీ:** ఉద్యోగ కల్పనలో ఎలక్ట్రానిక్స్ రంగం దూసుకుపోతున్నది. వచ్చే మూడేండ్లలో ఈ రంగంలో 1.2 కోట్ల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని టీమ్‌లీజ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. వీరిలో 30 లక్షల మంది ప్రత్యక్షంగాను, మరో 90 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయని పేర్కొంది. ప్రత్యక్షంగా ఉపాధి లభించనున్నవారిలో 10 లక్షల మంది ఇంజినీర్లు, 20 లక్షల మంది ఐటీఐ ప్రొఫెషనల్స్, 2 లక్షల మంది కృత్రిమ మేధస్సు, మెషిన్‌లెర్నింగ్, డాటా సైన్సెస్, నాన్-టెక్నికల్ విభాగానికి చెందిన 90 లక్షల మందికి ఉపాధి లభించనున్నది.



# రసవత్తరంగా మెల్‌బోర్న్ టెస్ట్

## టెయిలెండర్ల ముందు తేలిపోయిన భారత బౌలర్లు..

## ఆస్ట్రేలియా లీడ్ 333 రన్స్

## 4వ రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ 228/9

## పదో వికెట్‌కు 50 పరుగులు జోడించిన ఆస్ట్రేలియా






**మెల్‌బోర్న్:** భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగ్నుతున్న నాలుగో టెస్టు ఆసక్తికర ముగింపు దిశగా సాగుతోంది. ఇరు జట్ల మధ్య ఆధిపత్యం మారుతూ వస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా భారీ స్కోరు చేసి పైచేయి సాధించినట్లు కనిపించింది. ఆ తర్వాత నితీశ్ రెడ్డి పోరాడటంతో భారత్ కూడా పోటీలోకి వచ్చింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో భారత బౌలర్లు సత్తాచాటడంతో ఓ దశలో ఆస్ట్రేలియా 91/6తో నిలిచింది. ఈ సమయంలో భారత్ పైచేయి సాధించినట్లు కనిపించింది. కానీ టెయిలెండర్లు పోరాడటంతో నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 228/9తో నిలిచింది. దీంతో ఐదో రోజు ఆట ఆసక్తికరంగా మారింది.

ఓవర్ నైట్ స్కోరు 358/9తో నాలుగో రోజు ఆట ప్రారంభించిన భారత్.. మరో 11 పరుగులు జోడించి ఆలౌట్ అయింది. సెంచరీ హీరో నితీశ్ రెడ్డి 114 పరుగులు చేసి.. చివరి వికెట్‌గా వెనుదిరిగాడు. దీంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 369 పరుగులకు ఆలౌట్ అయింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 474 పరుగులు చేయగా.. 105 పరుగులు లీడ్ లభించింది. ఆస్ట్రేలియా బౌలర్లలో కెప్టెన్ పాట్ కమిన్స్, స్కాట్ బొలాండ్, నాథన్ లైయాన్ మూడేసి వికెట్ల చొప్పున తీశారు.

అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఆస్ట్రేలియాకు భారత బౌలర్లు షాక్ ఇచ్చారు. తొలి ఇన్నింగ్స్ హాఫ్ సెంచరీ చేసిన ఆసీస్ ఓపెనర్ సామ్ కొన్‌స్టాస్ (8)ను క్లీన్ బౌల్డ్ చేశాడు. సిరాజ్ కూడా వికెట్ల వేటను మొదలెట్టడంతో భారత్ వరుసగా వికెట్లు పడగొట్టింది. ఓ దశలో స్వల్ప వ్యవధిలోనే.. స్మిత్ (13), హెడ్ (1), మిచెల్ మార్ష్ (0), అలెక్స్ కేరీ (2) వికెట్లు కోల్పోయిన ఆస్ట్రేలియా 91/6తో పీకల్లోతు కష్టాల్లో పడింది.

ఈ దశలో మార్నస్ లబుషేన్ (70)కు జతకలిసిన కెప్టెన్ ప్యాట్ కమిన్స్ (41) కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. అయితే జట్టు స్కోరు 156 పరుగుల వద్ద లబుషేన్, 173 పరుగుల వద్ద కమిన్స్ ఔట్ అయ్యారు. అప్పటికీ ఆస్ట్రేలియా లీడ్ 278గా ఉంది. దీంతో భారత్ ముందు 300 కంటే తక్కువ లక్ష్యమే నిలిచేలా కనిపించింది. కానీ పదో నెంబర్ బ్యాటర్ నాథన్ లైయాన్ (54 బంతుల్లో 41 రన్స్), చివరి బ్యాటర్ స్కాట్ బొలాండ్ (65 బంతుల్లో 10 రన్స్) గొప్పగా పోరాడారు.

భారత బౌలర్లు ఎంత ప్రయత్నించినా వీరిద్దరూ మొండిగా బ్యాటింగ్ చేశారు. క్రీజులో పాతుకుపోయారు. 110 బంతులు ఆడిన వీరు.. అబేధ్యమైన పదో వికెట్‌కు 55 పరుగులు జోడించారు. నాలుగో రోజు చివరి ఓవర్‌లో వికెట్ పడ్డా.. నోబాల్ కావడంతో లైయాన్ బతికిపోయాడు. దీంతో నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 228/9తో నిలిచింది. ఇప్పటికే లీడ్ 333 పరుగులకు చేరింది. ఆట ఒక్కరోజు మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో ఐదో రోజుపై ఆసక్తినెలకొంది.

# మెల్‌బోర్న్ టెస్టులో అనూహ్య ఘటన..

## సిరాజ్ క్యాచ్ కోసం అప్పీలు చేయగా నాటౌట్‌గా తేల్చిన థర్డ్ అంపైర్

## సందేహం తీరకపోవడంతో డీఆర్ఎస్ కోరిన ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్

## అప్పటికే థర్డ్ అంపైర్ పరిశీలించడంతో మరోసారి సమీక్షించలేమంటూ తిరస్కరించిన ఫీల్డ్ అంపైర్



**మెల్‌బోర్న్:** భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య మెల్‌బోర్న్ వేదికగా జరుగుతున్న నాలుగవ టెస్ట్ మ్యాచ్ ఆట నాలుగవ రోజున ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. మహ్మద్ సిరాజ్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో బంతి బ్యాట్‌ను తాకి నేరుగా ఫీల్డర్ చేతిలోకి వెళ్లిందని భావించిన ఆసీస్ ఆటగాళ్లు క్యాచ్ ఔట్‌కు అప్పీలు చేశారు. స్పష్టంగా కానరాకపోవడంతో థర్డ్ అంపైర్‌కు రిఫర్ చేస్తూ ఫీల్డ్ అంపైర్ నిర్ణయం తీసుకున్నాడు. వేర్వేరు యాంగిల్స్‌లో క్షుణ్ణంగా పరిశీలించిన థర్డ్ అంపైర్... బంతి బ్యాట్‌ను తాకిన తర్వాత నేలను తాకి ఫీల్డర్ చేతుల్లోకి వెళ్లిందని నిర్ధారించారు. దీంతో సిరాజ్‌ను నాటౌట్‌గా పరిగణించి ప్రకటించారు.

ఆస్ట్రేలియా ఆటగాళ్లకు అప్పటికీ సందేహం తీరకపోవడంతో డీఆర్ఎస్‌కు వెళ్లాలని భావించారు. డీఆర్ఎస్ కోరుతూ ఆ జట్టు కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్ అంపైర్‌కు సూచించాడు. అయితే, ప్యాట్స్ కమ్మిన్స్ నిర్ణయాన్ని ఫీల్డ్ అంపైర్ తిరస్కరించారు. అప్పటికే థర్డ్ అంపైర్ పరిశీలించి నిర్ణయం వెల్లడించినందున మరోసారి రిఫర్ చేయడం కుదరని, రెండోసారి సమీక్షించలేమని వివరించారు. దీంతో కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్ ఒకింత షాక్‌కు గురైనట్టు అతడి హావభావాలు కనిపించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# అత్యంత వేగంగా 200 వికెట్లు.. బుమ్రా మరో ఘనత

## ట్రావిస్ హెడ్‌ను అవుట్ చేయడం ద్వారా 200 వికెట్ల క్లబ్‌లోకి బుమ్రా

## 44 టెస్టుల్లోనే 200 వికెట్ల మైలురాయిని అందుకున్న పేసర్

## రవీంద్ర జడేజాతో కలిసి జాయింట్ రికార్డ్

## ఈ జాబితాలో అగ్రస్థానంలో రవిచంద్రన్ అశ్విన్

## 37 టెస్టుల్లోనే 200 వికెట్లు సాధించిన మాజీ ఆఫ్ స్పిన్నర్



**మెల్‌బోర్న్:** టీమిండియా పేసర్ జస్ప్రీత్ బుమ్రా మరో ఘనత సాధించాడు. టెస్టు క్రికెట్‌లో అత్యంత వేగంగా 200 వికెట్లు పడగొట్టిన ఇండియన్ పేసర్‌గా రికార్డులకెక్కాడు. ఆస్ట్రేలియాతో మెల్‌బోర్న్‌లో జరుగుతున్న బాక్సింగ్ డే టెస్టులో నాలుగో రోజు ఆటలో ఈ రికార్డును తన పేరున రాసుకున్నాడు. గతంలో ఈ రికార్డు దిగ్గజ క్రికెటర్ కపిల్‌దేవ్ పేరిట ఉండేది. 50 టెస్టు మ్యాచుల్లో కపిల్ ఈ రికార్డు సాధించాడు. 1983లో పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో కపిల్ 200వ వికెట్ పడగొట్టాడు.

బుమ్రా ఇప్పుడు 44 టెస్టుల్లోనే 200 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు. ఫలితంగా అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన ఇండియన్ పేసర్‌గా రవీంద్ర జడేజాతో కలిసి రికార్డును పంచుకున్నాడు. ఇక, ఈ జాబితాలో రవిచంద్రన్ అశ్విన్ అందరికంటే ముందున్నాడు. బ్రిస్బేన్ టెస్టు తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన అశ్విన్ 37 టెస్టుల్లోనే 200 వికెట్లు పడగొట్టాడు. 2016లో కాన్పూరులో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో అశ్విన్ ఈ ఘనత సాధించాడు.

ఇక, ఆస్ట్రేలియాతో మెల్‌బోర్న్‌లో జరుగుతున్న టెస్టులో ట్రావిస్ హెడ్‌ను అవుట్ చేయడం ద్వారా బుమ్రా 200 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు. కాగా, ఓవరాల్‌గా ఈ రికార్డు పాకిస్థాన్ స్పిన్నర్ యాసిర్ షా పేరును ఉంది. యాసిర్ 33 టెస్టుల్లోనే 200 వికెట్లు సాధించాడు. ఆస్ట్రేలియా పేసర్ డెన్నిస్ లిల్లీ 38 టెస్టుల్లో ఈ రికార్డు అందుకున్నాడు.

# గవాస్కర్ కాళ్లు మొక్కిన నితీష్‌రెడ్డి తండ్రి..



**మెల్‌బోర్న్:** భారత యువ క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డి ఆస్ట్రేలియాతో మెల్‌బోర్న్ టెస్టులో 8వ స్థానంలో వచ్చి అద్భుతమైన సెంచరీ చేయడంతో ఆయన తండ్రి ముత్యాల రెడ్డి ఎంతో ఎమోషనల్ అయ్యారు. మ్యాచ్ అనంతరం నితీష్ తండ్రి ముత్యాలరెడ్డి సునీల్ గవాస్కర్ కాళ్లు మొక్కారు. ఆ తర్వాత నితీష్ రెడ్డి సోదరి కూడా గవాస్కర్ పాదాలకు నమస్కరించారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

మెల్‌బోర్న్ టెస్టు మూడో రోజు ఆట ముగిసిన అనంతరం నితీష్ కుమార్ రెడ్డి కుటుంబం గవాస్కర్‌తో సమావేశమైంది. ఈ సమావేశంలో నితీష్ తండ్రి భావోద్వేగానికిలోనయ్యారు. గవాస్కర్ కనిపించగానే ఆయనను ఆలింగనం చేసుకోవడానికి ముందు కాళ్లపై పడ్డారు. మోకాళ్లపై కూర్చుని కాళ్లు మొక్కారు. అదేవిధంగా తన కుమారుడిపై ప్రశంసలు కురిపించిన మాజీ ఆటగాళ్లు అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


ఈ సమావేశంలో సునీల్ గవాస్కర్.. నితీష్ కుమార్ రెడ్డి గురించి, అతని బ్యాటింగ్ గురించి మాట్లాడారు. ఆతనో వజ్రమని కితాబిచ్చాడు. మెల్‌బోర్న్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 8వ స్థానంలో క్రీజులోకి వచ్చిన నితీష్ రెడ్డి.. 189 బంతులు ఎదుర్కొని 114 పరుగులు చేశాడు. దాంతో ఇన్నింగ్స్‌లో భారత్ తరపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. నితీష్ ఆటను టెస్టు చరిత్రలోనే అత్యుత్తమ ఇన్నింగ్స్‌గా క్రికెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

తాజా ఇన్నింగ్స్‌తో భారత టెస్టు చరిత్రలో 8వ నంబర్ బ్యాట్స్‌మెన్‌గా బరిలో దిగి రెండో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నితీష్ నిలిచాడు. అంతకుముందు 2002లో వెస్టిండీస్‌పై అజయ్ రాత్రా అజేయంగా 115 పరుగులు చేశాడు. కాగా మెల్‌బోర్న్‌లో సాధించిన సెంచరీని నితీష్ కుమార్ రెడ్డి తన తండ్రికి అంకితమిచ్చాడు.

# 'గేమ్ చేంజర్' ట్రైలర్ వచ్చేసింది


మెగా అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సమయం వచ్చేసింది. 'గేమ్ ఛేంజర్ ట్రైలర్ ఎప్పుడు వస్తుందా అని వెయిట్ చేస్తున్న మెగా ఫ్యాన్స్‌కు నిర్మాత దిల్ రాజు గుడ్ న్యూస్ చెప్పాడు. ఈ మూవీ ట్రైలర్‌ను న్యూ ఇయర్ కానుకగా.. జనవరి 01న విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా బృందావన కాలనీలోని వజ్రా మైదానంలో 256 అడుగుల రామ్‌చరణ్ భారీ కటౌట్ ఏర్పాటు చేశారు అభిమానులు. అయితే ఈ కటౌట్ లాంఛ్ వేడుకకు ముఖ్య అతిథిగా వచ్చాడు దిల్ రాజు. ఈ సందర్భంగానే మూవీ ట్రైలర్ జనవరి 01న రాబోతుంది వెయిట్ చేయండి అంటూ చెప్పుకొచ్చాడు.

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తేజ్, దిగ్గజ దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. ఈ సినిమాను అగ్ర నిర్మాత దిల్ రాజు నిర్మిస్తుండగా.. థమన్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. భారీ బడ్జెట్‌తో రాబోతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ కథానాయికగా నటిస్తుండగా.. సునీల్, ఎస్ జే సూర్య కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే మూవీ నుంచి టీజర్‌తో పాటు పాటలను విడుదల చేయగా.. సూపర్ రెస్పాన్స్‌తో దూసుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే ట్రైలర్ కోసం వెయిట్ చేస్తున్నారు అభిమానులు.




# విజయవాడలో 256 అడుగుల రామ్ చరణ్ భారీ కటౌట్

రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న గేమ్ చేంజర్ మూవీ మీద భారీ అంచనాలు నెలకొన్నాయి. పుష్ప 2 తర్వాత ఆ రేంజ్ లో గేమ్ చేంజర్ మూవీకి హైప్ క్రియేట్ అయ్యింది. ఇదిలా ఉంటే తాజాగా విజయవాడలో రామ్ చరణ్ కోసం 256 అడుగుల భారీ కటౌట్ ను ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఈ కటౌట్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. గేమ్‌ఛేంజర్ మూవీకి తమిళ దిగ్గజ దర్శకుడు శంకర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. కార్తీక్ సుబ్బరాజు కథను అందిస్తున్నాడు. పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు తెరకెక్కిస్తున్నారు. ఇక ఈ సినిమాను సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు మేకర్స్. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా.. అరుదైన ఫీట్‌ను అందుకున్నాడు రామ్ చరణ్. ఈ సినిమా విడుదల సందర్భంగా విజయవాడ బృందావన కాలనీలోని వజ్రా మైదానంలో 256 అడుగుల రామ్‌చరణ్ భారీ కటౌట్ ఏర్పాటు చేశారు అభిమానులు.



# పవన్ మూవీ సమ్మర్ లోనైనా వస్తుందా?

రాజకీయాల్లో బిజీ అయిపోయాక పవన్ కల్యాణ్ సినిమాలను పూర్తిగా తగ్గించేశారు. దీంతో అభిమానులు ఆయన మూవీ కోసం ఎదురుచూస్తున్నారు. పవన్ రాజకీయపరమైన కార్యక్రమాలకు వెళ్లినా సినిమాల గురించే అడుగుతున్నారు. ఇటీవల పవన్ కల్యాణ్ అభిమానుల మీద ఒకింత అసహనానికి కూడా గురైన విషయం తెలిసిందే. అయితే మరి పవన్ కల్యాణ్ సినిమా కనీసం సమ్మర్ లోనైనా విడుదల అవుతుందా? అని ఫ్యాన్స్ ఆశపడుతున్నారు. పవన్ కల్యాణ్ చేతిలో ఇప్పుడు రెండు సినిమాలు ఉన్నాయి. ఓజీ, హరి హర వీరమల్లు సినిమాలు రెండూ సగానికి పైగా రెడీ అయి వున్నాయి. దాదాపు ఏడెనిమిది నెలల నుంచీ ఈ సినిమాలది ఇదే పరిస్థితి. కొన్నాళ్ల క్రితం మంగళగిరి ప్రాంతంలోనే సెట్ వేసి ఓ షెడ్యూలు చేసారు హరి హర వీరమల్లు సినిమాకు. ఓజీకి అయితే అదీ లేదు. 'హీరో లేని సీన్లు' అనే కొత్త కాన్సెప్ట్ ప్రకారం షూట్ చేసుకుంటూ వెళ్తున్నారు. మరి ఈ సినిమాలు ఎప్పటికి విడుదలవుతాయో వేచి చూడాలి.



# కొత్త ఏడాది నన్ను కొత్తగా చూస్తారు



రకుల్ ప్రీత్ సింగ్ కు ఈ మధ్య కాలంలో టైమ్ కలిసిరావడం లేదు. ఇటు సౌత్ ఇండస్ట్రీలోగానీ.. అటు నార్త్ లోనూ పెద్దగా సక్సెస్ రేటు లేదు. తెలుగు-తమిళ భాషల్లో ఆమె నటించిన భారతీయుడు-2 సినిమా అట్టర్ ఫ్లాప్ అయింది. తమిళ్ లో వచ్చిన అయలాన్ సినిమా ఆమె కెరీర్ కు పెద్దగా కలిసిరాలేదు. ఇలా 2024లో 2 సినిమాలకే పరిమితమైంది రకుల్. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే, ఈ రెండూ ఈ ఏడాది రావాల్సిన సినిమాలు కావు. అయలాన్ సినిమా 2023 దీపావళికే రావాలి, వాయిదా పడుతూ, ఈ ఏడాది థియేటర్లలోకి వచ్చింది. ఇక భారతీయుడు-2 సినిమా కూడా అంతే. గతేడాది రావాల్సిన ఆ మూవీ, ఈ ఏడాది రిలీజైంది. కొత్త ఏడాది మాత్రం అలా ఉండదంటోంది రకుల్. సౌత్ లో, నార్త్ లో మంచి ప్రాజెక్టులతో అలరిస్తానని చెబుతోంది. న్యూ ఇయర్ లో హిందీలో రకుల్ నుంచి దేదే ప్యార్ దే 2, మేరీ హస్బెండ్ కీ బీవీ, అమీరీ సినిమాలు రాబోతున్నాయి. వీటిలో తన పాత్రలన్నీ కొత్తగా ఉంటాయని చెబుతోంది. ఇటు సౌత్ లో ఆమె నటించిన భారతీయుడు-3 సినిమా థియేటర్లలోకి రానుంది. ఈ సినిమా ఓటీటీలో నేరుగా రిలీజ్ అవుతుందనే ప్రచారం జరిగినప్పటికీ, థియేటర్లలోకే వస్తుందని తాజాగా దర్శకుడు శంకర్ స్పష్టతనిచ్చాడు. కొత్త ఏడాదికి స్వాగతం పలికేందుకు భర్త జాకీ భగ్నానీతో కలిసి లండన్ వెళ్లింది రకుల్. అక్కడే ఆమె తన పుట్టినరోజును కూడా సెలబ్రేట్ చేసుకుంది. పెళ్లి తర్వాత భర్తతో కలిసి రకుల్ జరుపుకుంటున్న తొలి నూతన సంవత్సర వేడుక ఇదే.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.